
# జంగిలిగొండ గ్రామ చరిత్ర

## 1949-2021







గ్రామం : జంగిలిగొండ, మండలం, జిల్లా : మహబూబాబాద్ - 506 104 (TS)

# అంకితం

"జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసీ"



నా నేల తల్లి జంగిలిగొండకు..
తను కష్టాల కడలిలో ఉండి
నాకు బతుకు బాటను చూపిన
నా కన్న తల్లి గుండెల వీరమ్మకు..
నాకు లోకం పోకడ తెలవకముందే ఈ లోకం
విడిచి వెళ్లిన నా కన్న తండ్రి గుండెల వీరయ్యకు..
పాదాభివందనములతో అంకితం...

\- రచయిత



## సందేశం

మానవ సమాజం వైజ్ఞానికంగా ఎంత అభివృద్ధి చెందినా తమ చరిత్రను మర్చిపోవద్దు. గత అనుభవాలే మనిషి భవిష్యత్తుకు దారులు చూపిస్తాయి. దేశానికి వెన్నెముక లాంటి గ్రామాల చరిత్ర రచనా నిర్మాణం జరగాలి. అనేక అంశాలతో ఒక్క గ్రామానికి సంబంధించిన సమగ్ర సమాచారం ఈ తరానికి తెలియాలనే ప్రయత్నమే గుండెల రాజు చేశారు. చీకటిని చీల్చి వెలుగులు నింపే తన పాత్రికేయ అక్షరాయుధం నుండి ఉద్భవించిన అక్షరాల సమాహారమే 'జంగిలిగొండ గ్రామ చరిత్ర". ప్రపంచమే కుగ్రామంగా మారిన ఈ కంప్యూటర్ ఆధునికయుగంలో కళాకారుడిగా, జర్నలిస్టుగా, ఉద్యమకారుడిగా గుండెల రాజు తాను పుట్టిన ఊరి చరిత్రను భవిష్యత్తు తరాలకు అందించాలనే సదుద్దేశ్యంతో ఎన్నో వ్యయప్రయాసలకోర్చి అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా "అక్షరాల-ఇటుకలు" పేర్చి గ్రామ గ్రంథాన్ని నిర్మించడం అభినందనీయం..

**( కె.శశాంక )** IAS

కలెక్టర్, మహబూబాబాద్ జిల్లా





## సందేశం

వ్యక్తులుగానీ, వ్యవస్థలుగానీ తమ పూర్వకాల అనుభవాలను చరిత్రగా అధ్యయనం చేయాలి. గ్రామ స్థాయి నుండి చారిత్రక వైశిష్ట్యాన్ని కూడా భవిష్యత్ తరాలకు అందించాలి. దేశ చరిత్రకు పునాది గ్రామ చరిత్రే అని భావించి పూర్తి విశ్వసనీయ సమాచారంతో పుస్తక రచన జరిగింది. మారుమూల గ్రామంలో సాధారణ కుటుంబంలో పుట్టిన గుండెల రాజు కళాకారుడిగా, ఉద్యమకారుడి గానే కాకుండా ఒక జర్నలిస్టుగా తన అక్షరాయుధంతో సమాజగతినే మార్చడం అభినందనీయం. కన్న తల్లిదండ్రులను, పుట్టిన ఊరును మర్చిపోతున్న ఈ రోజుల్లో తన ఊరు చరిత్రను గ్రంథస్తం చేసి 'జంగిలిగొండ గ్రామ చరిత్ర' ద్వారా భావితరాలకు తరగని విజ్ఞాన సంపదను అందిస్తున్నాడు. జిల్లాలో తనదైన ముద్రవేసిన జంగిలిగొండ నుండి ఐఎఎస్, ఐపీఎస్ లాంటి ఉన్నత ఉద్యోగులు రావాలని ఆశీస్తున్నా...

**( శరత్ చంద్ర పవార్ )** IPS

ఎస్పీ, మహబూబాబాద్ జిల్లా





# ముందుమాట

సహజంగా దేశ చరిత్ర, రాష్ట్రాల చరిత్రలే ఇప్పటి వరకు చదువుకున్నాం. దేశానికి వెన్నెముక లాంటి గ్రామాల చరిత్రలు ఇప్పటి వరకు వెలుగులోకి రాలేదు. ఘణమైన గ్రామ చరిత్రలే దేశ చరిత్రకు పునాది. సాంస్కృతిక వారసత్వ సంపదతో పాటు భౌగోళిక, నైసర్గిక అంశాలను ఉటంకిస్తూ విభిన్నజాతుల ప్రజా సమూహ జీవనశైలికి అద్దంపట్టివే గ్రామాలు. అలాంటి గ్రామ చరిత్రను అక్షరాల ఇటికలతో పేర్చి గ్రామ గ్రంథాన్ని నిర్మించాలని భావించాను. నామస్థిష్కంలో ఉదయించిన ఆ ఆలోచనా ప్రతిరూపమే ననుగన్న నా ఊరూ **"జంగిలిగొండ గ్రామ చరిత్ర"**. గ్రామానికి సంబంధించి గతం, వర్తమానంలో జరిగిన సంఘటనలతో ఈ గ్రంథంలో సవివరంగా పొందు పర్చాను. నేటి చరిత్ర రేపటి చరిత్రకు మూలాధారం అవుతుందని నా ఆశ.. ఆకాంక్ష. **1949–2021** మధ్య జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా భౌగోళిక స్వరూపం, పంచాయతీ ఆవిర్భావం, విశిష్ట వ్యక్తులు, వనరులు, దేవాలయాలు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ విశ్లేషణతో కూడిన చరిత్రకు అక్షర రూపమే జంగిలిగొండ గ్రామ చరిత్ర. ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి 2019 నుండి మూడేళ్ల పాటు పరిశోధన చేసి, భవిష్యత్తు తరాల అభ్యున్నతి కోసం పుస్తక రూపకల్పన చేశాను. విద్యార్థులు, మేధావులకు ఈ గ్రామ గ్రంథం ఒక దిక్సూచిగా నిలుస్తుందని నా నమ్మకం. అంతేగాక రాష్ట్రంలోని ప్రతి గ్రామ చరిత్రను భావిష్యత్ తరాలకు అందజేయాలనే స్ఫూర్తి, సంకల్పం యువతకు ఈ గ్రంథం ద్వారా కలుగుతుందని నా విశ్వాసం.

*ధన్యవాదాలతో..*

తేది: 15-01- 2022, జంగిలిగొండ



**గుండెల రాజు ముదిరాజు**
సీనియర్ జర్నలిస్టు




# ఇండెక్స్


తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో..........:06

'కొండపల్లి'కి వ్యతిరేకంగా తిరుగుబాటు........... .:07

జంట... /పంచాయతీ ఆవిర్భావం / విభజన.... :08

భౌగోళిక స్వరూపం / విశిష్టవ్యక్తులు................:09

మన ఊరిలో తుపాకీ తయారీ......................:10

144సెక్షన్.. / ప్రాణం తీసిన.. / బందిపోటు .... ..:11

అందరివాడే.. / వింతలు.. / సామాజిక సేవలో.... .12

మన ఊరి ప్రాంతాలు / మారు పేర్లు.................:13

చనిపోయి..బతికిన వీరమ్మ / భూముల రకాలు....:14

ప్రభుత్వ భూములు / నీటి వనరులు.................:15

ఖనిజ వనరులు.................................. .:16

జనాభా, కుటుంబాలు, ఓటర్లు / ప్రజా రవాణా... / రహదార్ల సౌకర్యాలు / రాజకీయ పార్టీలపై విశ్లేషణ :17

ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సౌకర్యాలు................ .:18

తాగునీటి సరఫరా పద్ధతులు........................:19

పంచాయతీ సర్పంచులు, సిబ్బంది వివరాలు.......:20

దేవాలయాలు.......................................:21

అపరిష్కృత ప్రధాన సమస్యలు........... ...........:22

పండుగలు, సాంస్కృతిక కార్యకలాపాలు............:23

స్వచ్ఛంధ సంస్థలు వాటి కార్యకలాపాలు............:24

గ్రామీణ బ్యాంకు, రుణసౌకర్యాలు / ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలు..............................: 25


ఆర్థిక వనరులు / ప్రజారోగ్యం / కరోనాలో...........:26

కుల సంఘాలు, ప్రతినిధులు / సొసైటీ సంఘాలు / ప్రజా పంపిణీ వ్యవస్థ / మండల ప్రాదేశిక సభ్యులు..:27

విద్య, ఉద్యోగ, ఇతర రంగంలో.....................:28

నవ్వులు పూయిస్తాడు.. మన రాజమౌళి.............:29

చిత్రకారుడై..పాత్రికేయుడై..ఉద్యమబాటలో........:30


మహబూబాబాద్ జిల్లా కేంద్రం నుండి జంగిలిగొండ గ్రామానికి రూట్ మ్యాప్

దట్టమైన అడవి కొండల నడుమ గ్రామం ఉండేదని చరిత్రకారులు చెబుతున్నారు. అయితే జంగిల్ (అడవి) లోని కొండల మధ్య ఉన్న ఊరిని అప్పట్లో జంగ్లికొండగా పిలిచేవారు. గ్రామానికి తూర్పు అభిముఖంగా ఉన్న గుట్టకు ఊరగుట్టగా పేరొచ్చింది. కొంత కాలం తర్వాత కలరా వ్యాధి రావడంతో అక్కడి నుండి ప్రజలు పాత చెరువు సమీప మామిళ్లగడ్డకు వచ్చి నివాసం ఏర్పాటు చేసుకున్నారు. దీంతో పాత చెరువుకు ఊర చెరువుగా మరో పేరొచ్చింది. మరి కొంత కాలం తర్వాత మరో సారి కలరా వ్యాధి రావడంతో భీతిల్లిన ప్రజలు ప్రాణాలను అరిచేతులో పెట్టుకుని మకాం మార్చారు. ప్రస్తుతం ఉంటున్న గ్రామం ఉన్న దగ్గరె ఇండ్లు వేసుకుని నివాసం ఉంటున్నారు. నాడు జంగ్లికొండగా ఉన్న గ్రామం కాలక్రమేనా 'జంగిలిగొండ' గా మారింది..!

## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో..



తెలంగాణ ప్రాంతంలో నాటి నైజాం నిరంకుశత్వానికి భూస్వామ్యదొరల ఆగడాలకు ఖాసీంరజ్వీ రాక్షసత్వానికి ఎదురులేకుండా పోయింది. ప్రజల మానప్రాణాలకు రక్షణ కరువైంది. దీంతో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ద్వారా ప్రజలు తిరగబడ్డారు. ఈ ప్రజాపోరాటం కమ్యూనిస్టుల నాయకత్వంలో ఏడవ నిజాం నవాబ్ మీర్ ఉస్మాన్ అలీఖాన్‌కు వ్యతిరేకంగా జరిగింది. ఈ నేపథ్యంలో జంగిలిగొండ-కొత్తూర్ గ్రామాల్లో 1949లో సాయుధపోరాట కీలక ఘట్టాలు జరిగాయి. గ్రామంలో రజాకార్ల వైపు ఉన్న పోలీస్‌పటేల్ కొండపల్లి రామయ్యకు అనుకూలంగా కొంత మంది, కమ్యూనిస్టులకు అండగా మరి కొంత మంది ప్రజలు నిలిచారు.

ఈ క్రమంలో కురవి మండలం తాళ్లసంకీస గ్రామంపై జరిగిన దాడిని కొండపల్లి రాంచంద్రయ్య సమర్ధవంతగా తిప్పికొట్టాడు. ఆయన ధైర్యసాహసాలను గుర్తించిన నాటి నిజాం పాలకులు ఆయన కోరిక మేరకు జంగిలిగొండ -కొత్తూర్ గ్రామాల పోలీస్ పటేల్, మాలి పటేలుగా నియమించారు. అంతేగాక గ్రామంలో ఇనాం భూములను కూడా నిజాం పాలకులు కేటాయించారు. కొంత కాలం తరువాత కొండపల్లి రాంచంద్రయ్య మృతి చెందడంతో ఆయన చిన్నాన్న కుమారుడైన కొండపల్లి రామయ్యకు పోలీస్‌పటేలు, మాలి పటేల్‌గా బాధ్యతలు అప్పగించారు. కొండపల్లి రామయ్యకు సైకదార్‌గా గ్రామానికి చెందిన కంచర్ల వీరయ్య పని చేశారు. భూస్వామిగా ఉన్న కొండపల్లి రామయ్యకు ప్రజల మద్దతు ఉండేది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన రెంటల మదార్, వెన్ను వెంకయ్య కమ్యూనిస్టుల దళంలో పని చేశారు. ఆ తర్వాత గ్రామంలో గ్రామదళం ఏర్పాటు చేసుకుని గ్రామంలో ప్రతి రోజు ఊరేగింపులు చేసి కమ్యూనిస్టుపార్టీ పాటలు, రజాకార్లకు వ్యతిరేకంగా నినాదాలు ఇచ్చేవారు. కమ్యూనిస్టు దళాలువచ్చి గ్రామంలో ఉన్న మగవారితో ఊరుబయట రహస్యసమావేశాలు నిర్వహించేవారు. భూస్వాములకు వ్యతిరేకంగా పని చేస్తున్నట్లు ప్రకటించి, అప్పుడప్పుడు గ్రామానికి కమ్యూనిస్టులు వచ్చి వెళ్లేవారు. గ్రామంలో భూస్వాముల ఇండ్లపై దాడులు చేస్తామని ఒక్క రోజు ముందే కమ్యూనిస్టులు ప్రకటించేవారు. ఈ విషయాలను తెలుసుకున్న రజాకార్లు కమ్యూనిస్టులపై ఆరా తీసి గ్రామ దళ నాయకుడు వెన్ను వెంకయ్యపై కేసులు నమోదు చేసి జైలుకు పంపారు. ఆ తర్వాత గ్రామంలోకి కొంతమంది కమ్యూనిస్టు లీడర్లు తుపాకులతో వచ్చి రజాకార్ల ఇన్‌ఫార్మర్లను బెదిరించారు. ఈ క్రమంలోనే అనుమానంతో గోల్కొండ కన్నయ్యను తీసుకెళ్తుండగా చుట్టుప్రక్కల ప్రజలు కమ్యూనిస్టులతో వాగ్వివాదం చేసి తుపాకులను లాక్కొని విడిపించుకున్నారు. ఈ ఘటన తరువాత కమ్యూనిస్టులు గ్రామానికి వచ్చి సైకేదార్ కంచర్ల వీరయ్య ఇంటిని తగలబెట్టే ప్రయత్నం చేయగా తమ ఇండ్లు కూడా కాలిపోతాయని ప్రజలు



రజాకార్లు.. పోలీస్ క్యాంప్ నిర్వహించింది ఇక్కడే



మొరపెట్టు కోవడంతో వీరయ్య ఇంటితో పాటు మరి కొన్ని ఇండ్లను ధ్వంసం చేశారు. కొండపల్లి రామయ్యకు అనుకూలంగ ఉన్న పంజాల సాయన్న ఇంటిని దగ్ధం చేశారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితుల నడమ కొండపల్లి రామయ్య ఫిర్యాదుతో అదేరోజు రాత్రి చుడేదార్ పైజామాలు ధరించి కుచ్చుటోపీలు పెట్టుకొని నైజాం పోలీసు బలగాలు మానుకోట క్యాంపు నుండి దిగాయి. గ్రామంలో నాకబంధి చేసి, కమ్యూనిస్టులకు అనుకూలంగా ఉన్న ప్రజలను బెదిరింపులకు గురి చేశారు. అనుమానం వచ్చిన వెన్ను వెంకయ్య, ఎరుకల ఎల్లయ్య, మోద్గుపురం పుల్లయ్యలతో పాటు మరి కొందర్ని సావడి వద్దకు తీసుకవచ్చి చిత్రహింసలకు గురిచేశారు. ఈ విషయం తెలుసుకున్న మదార్ రాత్రికి రాత్రే ఖమ్మం జిల్లా బూర్గంపాడు మండలం ముసలంమడుగు అడవీ ప్రాంతంలో వెళ్లి తలదాచుకున్నాడు. పరారీలో ఉన్న మదార్ ఎక్కడ ఉన్నాడో చెప్పాలని ఆయన బంధువు కాశిమల్ల ఇద్దయ్యను రజాకార్లు పోలీస్ క్యాంపు సావడి వద్దకు తీసుకెళ్లి మీసాలు కొరిగించి, బట్టలు విప్పించి చిత్రహింసలు పెట్టారు. ఆ తర్వాత కమ్యూనిస్టు దళాలు దాడి చేస్తాయనే భయంతో పోలీస్‌పటేల్ కొండపల్లి రామయ్య ఫిర్యాదు మేరకు ఆయన ఇంటిలోనే పోలీస్‌క్యాంపు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రూపిరెడ్డి రంగారెడ్డి ఉంటున్న ఇంటి సమీపంలో కొండపల్లి రామయ్య నివాసం ఉండేది. అంతేగాక ఇతర ప్రాంతాల నుండి కమ్యూనిస్టులను తీసుకవచ్చి ఇక్కడి పోలీస్ క్యాంప్‌లో విచారించి శిక్షించేవారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఉధృతంగా జరుగుతున్న క్రమంలో కమ్యూనిస్టులు గ్రామంలోని భూస్వాముల భూములను ప్రజలకు పంపిణీ చేశారు. ఇక్కడి ప్రజలు ముందుకు రాకపోవడంతో వందలాది ఎకరాలు ప్రభుత్వ భూములు కొండపల్లి రామయ్య అధీనంలోకి వెళ్లాయి. అంతేగాక కొండపల్లి వారుసులు నేటికి ఆ భూములను సాగు చేసుకోవడం కొసమెరుపు.

## 'కొండపల్లి' కి వ్యతిరేకంగా తిరుగుబాటు


కొండపల్లి రామయ్య

పోలీస్ పటేల్‌గా పని చేసిన కొండపల్లి రామయ్యకు మొదట్లో వ్యతిరేకంగా ఎవరూ పని చేయలేదు. ఆయన ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కంచు కోటగా జంట గ్రామాలైన జంగిలిగొండ -కొత్తూర్ ఉండేవి. కొంత కాలం తర్వాత జంట గ్రామాలకు చెందిన యువకులు దేవరం వెంకట్‌రెడ్డి, కొమ్ము సత్యం నాయకత్వంలో యవత పని చేశారు. అయితే కొండపల్లి రామయ్యను వ్యతిరేకించి తిరుగుబాటు చేశారు. నూకల రాంచంద్రారెడ్డి వర్గంలో కొండపల్లి రామయ్య, జెన్నారెడ్డి జనార్థన్‌రెడ్డి వర్గంలో దేవరం వెంకట్‌రెడ్డి పని చేశారు. కొండపల్లి రామయ్య పోలీస్ పటేలు కావడంతో సర్పంచి ఎన్నికల్లో పోటీచేసేందుకు అవకాశం లేకుండా పోయింది. దేవరం వెంకట్‌రెడ్డి, కొమ్ము సత్యం మరియు రామయ్యలకు సంబందించిన ఇరు వర్గాల అభ్యర్థులను ఎన్నికల్లోకి దించారు. 1960లో జరిగిన పంచాయతీ తొలి ఎన్నికల్లో కొండపల్లి రామయ్యపై ప్రజలు తిరుగుబాటు చేయడంతో ఆయన అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. 1965లో రెండో సారి రామయ్య తరుపున అభ్యర్థిగా ఉన్న కొండపల్లి రంగయ్యను ఎన్నికల బరిలో దించడంతో చుంచు నర్సయ్య చేతిలో పరాజయం చెందాడు. పంచాయతీ తొలి రెండు ఎన్నికల్లో రామయ్య అభ్యర్థులపై గెలిచిన వార్డు సభ్యుల మోజార్టీ ప్రకారం సర్పంచిగా కొమ్ము సత్యం ఎన్నిక కాగా ఉప సర్పంచిగా దేవరం వెంకట్‌రెడ్డి ఎన్నికయ్యారు. రామయ్యను పంచాయతీ ఎన్నికల్లో జంట గ్రామాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. అంతేగాక అప్పట్లో యువకులదే పై చెయ్యిగా నిలిచింది.


జంగిలిగొండ గ్రామ వ్యూ



అన్నింటికి మించిన నేరం అన్యాయంతోను, అక్రమంతోను రాజీపడటమే : నేతాజీ

## జంట గ్రామాలు 'ఇస్సా' విలేజ్‌లు




సుబ్లేడ్ గ్రామానికి చెందిన రామ సహాయం వెంకట్ రెడ్డి జంగిలిగొండ -వీఎస్‌లక్ష్మీపురం (కొత్తూరు) జంట గ్రామాలు ఇస్సా (భాగం) విలేజ్‌లు. ఈ రెండు జంట గ్రామాలకు ఆయనే భూస్వామి.. అయితే ఆయన కుటుంబానికి జంగిలిగొండలో భూములు ఉన్నప్పటికీ సుబ్లేడ్‌లోనే నివాసం ఉండేవాడు. వెంకట్‌రెడ్డి మృతి చెందిన తరువాత ఆయన తనయుడు సత్యనారాయణరెడ్డి రాజకీయంలోకి వచ్చాడు. 1970లో ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పడిన తరువాత జంగిలిగొండ గ్రామ సర్పంచిగా ఎన్నికయ్యారు. దీంతో కొండపల్లి రామయ్య




తీవ్రంగా వ్యతిరేకించి కాంగ్రెస్ పార్టీలో మంత్రి నూకల రామ చంద్రా రెడ్డితో లాబీయింగ్ చేసి సత్య నారాయణ రెడ్డిని పదవిలో ఉండగానే రాజీ నామా చేయించారు. గ్రామంలో అందరికీ అనుకూలంగా ఉన్న పంజాల వీరయ్యను సర్పంచిగా నియమించడంతో 1981 వరకు పని చేశారు. తరువాత ప్రత్యక్ష పంచాయతీ ఎన్నికలు వచ్చాయి. కొండపల్లి రామయ్య సుమారు 16 ఏళ్లపాటు పోలీస్ పటేలుగా పని చేసి 1979లో మృతి చెందటంతో ఆయన వారసుడిగా కొండపల్లి రంగయ్య పోలీస్ పటేల్, మాలి పటేలుగా పని చేశారు..

జంగిలిగొండ గ్రామ వ్యూ




జంగిలిగొండ-కొత్తూర్ రెండు గ్రామ పంచాయతీలు ఒక్కటే. కానీ రెవెన్యూ గ్రామాలు మాత్రం వేరు వేరు ఉన్నాయి. 1960 నుండి 1970 వరకు జంగిలిగొండ గ్రామంలో కొత్తూర్ ఉమ్మడి గ్రామ పంచాయతీగా కొనసాగడం వలన **"జంగిలిగొండ-కొత్తూరు"** గా మరో పేరొచ్చింది. ఇప్పటికీ ఇతర ప్రాంతాలకు చెందిన ప్రజలు జంగిలిగొండ-కొత్తూర్‌గానే పిలుస్తుంటారు. అప్పట్లో జంగిలిగొండ, కేవులతండా, దుదియా తండా, రోటిబండతండా, వేంపల్లి శివారు (వీఎస్) లక్ష్మీపురం, కేశ్యతండా, హజర్యాతండా, మంక్యతండా, లక్ష్మాతండాలు జంగిలిగొండ ఉమ్మడి గ్రామ పంచాయతీలో భాగంగా ఉండేవి. అయితే 1960లో ఏర్పడిన ఉమ్మడి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మొదటి సర్పంచిగా ఎన్నికైన కొమ్ము సత్యం వీఎస్ లక్ష్మీపురం గ్రామానికి చెందిన వ్యక్తి. 1970లో ఏర్పాటైన ప్రత్యేక జంగిలిగొండ గ్రామ పంచాయతీకి రామసహాయం సత్యనారాయణరెడ్డి తొలి సర్పంచిగా ఎన్నికైయ్యారు. ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఉన్న జంగిలిగొండను 2018లో విభజన చేసి మూడు గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారు.



మామిళ్లగడ్డ

## పంచాయతీ ఆవిర్భావం



ఊరగుట్ట

## పంచాయతీ విభజన


జంగిలిగొండ గ్రామ పంచాయతీని 2018లో మూడు గ్రామ పంచాయతీలుగా విభజన చేశారు. జంగిలిగొండ గ్రామం కొత్తగా 8 వార్డులతో క్రాస్‌రోడ్ కాలనీ కలిపి మొత్తం 921ఎకరాల విస్తీర్ణంలో 1,306జనాభాతో జం గిలిగొండ గ్రామపంచాయతీని ఏర్పాటు చేశారు, దూదియా


అనేక నీతులు చెప్పడం కన్నా ఒక మంచిపని చేసి చూపెట్టడం మేలు : గాంధీజీ




జంగిలిగొండ గ్రామ మ్యాప్

తండాను రోటి బండ తండాలో కలిపి 8 వార్డులుగా విభజించి 526.25 ఎకరాల విస్తీర్ణంతో 802మంది జనాభాతో రోటిబండతండాను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు మరియు 425 మంది జనాభా కలిగి 302.15ఎకరాల విస్తీర్ణం గల కేవులతండాను 6 వార్డులుగా విభజించి కేవులతండా గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు.




రోటిబండతండాగ్రామ మ్యాప్

కొత్తగా ఏర్పాటైన ప్రత్యేక గ్రామ పంచాయతీలకు ఫిబ్రవరి2, 2019 రోజున ఎన్నికలు జరిగాయి. జంగిలిగొండ గ్రామ సర్పంచిగా పంజాల యాకసాయిలు, ఉపసర్పంచిగా పొదిల మల్లయ్య ఎన్నికయ్యారు. కాగా మల్లయ్య ఆనారోగ్యం తో ఆక్టోబర్ 20, 2021 రోజున మృతి చెందాడు. దీంతో ఉప ఎన్నికలకు ఆవకాశం ఏర్పడింది. రోటిబండ తండా గ్రామ సర్పంచిగా బానోత్ సరోజ, కేవూలతండా గ్రామ సర్పంచిగా బాదావత్ బాలు నాయక్ ఎన్నికయ్యారు.



కేవూలతండా గ్రామ మ్యాప్





పొలిమెర రాయి

భౌగోళిక విస్తీర్ణం 1,896 ఎకరాలతో 8 చ.కి. మీగా ఉంది. తూర్పున పాత చెరువు, పడమర కొత్త చెరువు ఉండటం విశేషం. ఆగ్నేయంలో ఉన్న గ్రామ పొలిమెర రాయి జంగిలిగొండ-నేరడ- చిన్నగూడూర్ గ్రామాలకు సరిహద్దులుగా ఉంది. గ్రామానికి తూర్పున ఉన్న అడ్డగుట్ట-పెద్దగుట్టలు మహబూబాబాద్-కురవి రెండు మండలాలకు సరిహద్దును నిర్ణయి స్తోంది. ఉత్తరాన ఎర్రరాళ్లతో కూడిన భాగాన్ని ఆక్రమించి ఉండటంతో వీటిని ఎర్రబోళ్లుగా పిలుస్తుంటారు. కొత్తచెరువు సమీపంలో ఉన్న గుట్టలను మూలగుట్టలుగా పిలుస్తుంటారు. జంగిలిగొండ గ్రామంతో పాటు నర్సింహులగూడెం, అమనగల్లు సరిహద్దు వరకు ఎర్రబోళ్లు విస్తరించి ఉన్నాయి. ఈశాన్యం లో పర్వతగిరి, నైరుతిలో కట్టుకాలువ ఉంది. వాయువ్యం దిక్కున నర్సింహులగూడెం ఉంది. అయితే లక్ష్మీనర్సింహాస్వామి దేవాలయం కల్గిన కోరగుట్టవైపు మబ్బులు కమ్ముకుంటే తప్పకుండా వాన పడుతుందని ఇప్పటికి ప్రజల్లో విశ్వాసం ఉంది. గ్రామానికి తూర్పున ఊరగుట్ట, పందిరిబోడ్, దొంతురాళ్లబోడ్, అడ్డగుట్టలు ప్రభుత్వ భూమిలో విస్తరించి ఉన్నాయి.



ఎర్రబోళ్లు

## విశిష్ట వ్యక్తులు

1956లో గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఏర్పడింది. పాఠశాల నిర్మాణం కోసం గ్రామానికి చెందిన బోళ్ల పర్వతాలు ఉచితంగా స్థలం ఇచ్చి దాతృత్వాన్ని చాటుకున్నాడు. గ్రామానికి ఆగస్టు11, 1980న కరెంట్ వచ్చింది. ఆనాటి సర్పంచిగా పని చేసిన పంజాల వీరయ్య, కాంగ్రెస్ లీడర్ దేవరం వెంకట్‌రెడ్డి


బీసీ కాలనీ

హయాంలో కరెంట్ సౌకర్యం కల్పించారు. ప్రస్తుతం ఉన్న పంచాయతీ భవన స్థలం, బందెలదొడ్డి కోసం దేవరం వెంకట్ రెడ్డి హయాంలో భూమి కొనుగోలు చేశారు. ఈ పనులు కొంత ప్రారంభించగా తరువాత సర్పంచిగా ఎన్నికైన కొండపల్లి రాంచందర్‌రావు పంచాయతీ భవన నిర్మాణం పూర్తి చేసి, ఫిబ్రవరి 13, 1991 రోజున భవనం ప్రారంభించారు. 1985లో పంజాల లింగమూర్తి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి గ్రామీణ క్రీడలు నిర్వహించారు. అంగన్వాడి కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలను నిర్మించిన స్థలాన్ని గ్రామానికి చెందిన రామసహాయం సత్యనారాయణ రెడ్డి 1986లో భూమిని ఉచితంగా ఇచ్చి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. చావ కృష్ణయ్య పట్వారిగా పని చేశారు. గ్రామానికి చెందిన కొండపల్లి రాంచందర్‌రావు సర్పంచిగా ఉన్న హయాంలోనే మంచినీటి బావిని తవ్వించి, పైపులైన్లు ఏర్పాటు చేయించారు. లయన్స్ క్లబ్ మహబూబాబాద్ ఆధ్వర్యంలో మార్చి 03,2013న దాత డాక్టర్ ఇంద్రసేనారెడ్డి బస్‌షెల్టర్ నిర్మాణం చేయించారు. మాజీ సర్పంచి దేవరం వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో 1982లో ఎస్సీ కాలనీలో 25 ఇళ్లు, 1994లో బీసీకాలనీలో 36 మంది నిరుపేదలకు ఇండ్లు నిర్మించి పంపిణీ చేశారు. 1995లో సీపీఐ ఆధ్వర్యంలో ఆర్అండ్‌బీ రోడ్డు బస్టాండ్ నుండి గ్రామానికి నూతన రోడ్డు నిర్మాణం చేయించారు. 2015లో పంజాల సత్యనారాయణ తల్లిదండ్రులైన పంజాల రామచంద్రయ్య-రాజమ్మల జ్ఞాపకార్థం గ్రంథాలయాన్ని నిర్మించారు. గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు గుండెల రాజు గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం 2012లో జిల్లా ప్రజా పరిషత్ నుండి రూ.5లక్షల నిధులను మంజూరి చేసేందుకు కృషి చేశాడు. కొయ్యల మల్లయ్య ఇంటి నుండి గుర్రాల నారాయణ ఇంటి వరకు సీసీ రోడ్డు పనులు పూర్తి చేయించాడు. అంతేగాక మరి కొన్ని రోడ్ల నిర్మాణం కోసం అధికారులకు ప్రతిపాదనలు పంపాడు. గ్రామానికి చెందిన కొయ్యల అనిల్ ఆర్టీఐ స్టేట్ ప్రసిడెంట్‌గా కొనసాగుతున్నాడు.


జడ్పీ నిధుల నుండి నిర్మించిన సీసీరోడ్


గ్రంథాలయం


బస్‌షెల్టర్


ట్రాన్స్‌ఫార్మర్

## మన ఊరిలో తుపాకీ తయారీ



మన గ్రామంలో నాటు తుపాకీలు తయారు చేసినట్లు చరిత్ర చెబుతుంది. స్వాతంత్ర్యానికి పూర్వం నైజాం కాలంలో బైరోజు బ్రహ్మయ్య నాటు తుపాకీ తయారు చేసేవాడు. తుపాకీ తయారీ కోసం లోహపు మోట బొొక్కెనలను కరిగించి.. గొట్టాలు తయారు చేసి చెక్కలను వినియోగించి తుపాకీకి రూపం కల్పించేవాడు. అంతే గాక సీసం, చరాలతో మందు గుండు సామాగ్రి తయారు చేసేవాడు. పక్షులను, జంతువులను వేటాడే తుపాకులతో పాటు ఆత్మరక్షణ కోసం మనుషులు వాడే నాటు తూపాకీలను సైతం తయారు చేసేవాడు. అంతేగాక ఆ కాలంలో చాలా మంది రాజకీయ నాయకులు తమ రక్షణ కోసం బైరోజు బ్రహ్మయ్య దగ్గర నాటుతుపాకీ కొనుగోలు చేసేవారని, ఈ ప్రాంతమంత దట్టమైన అడవి ఉండటంతో ఇక్కడి ప్రజలు కూడా నాటు తుపాకీ కొనుగోలు చేసి వేటకు వేళ్లేవారని ప్రచారంలో ఉంది.

## 144 సెక్షన్.. అప్పట్లో సెన్సేషన్..!

1996 ఏప్రియల్ పార్లమెంట్ ఎన్నికల జరుగుతున్న సందర్భమది. జంగిలిగొండ మాత్రం పార్టీల మధ్య అధిపత్య వేడిలో నిప్పులకొలిమిలా మండుతోంది.. తెలుగుదేశం - కాంగ్రెస్ పార్టీల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్న రోజులవి. పోలీస్ బందోబస్త్ నడుమ గ్రామంలో ఎన్నికలు ప్రారంభమయ్యాయి. పోలింగ్ బూత్ నుండి వంద మీటర్ల వరకు నిషేదిత ప్రాంతంగా ప్రకటిం చారు. గీత వద్ద వేచి ఉన్న రెండు పార్టీల లీడర్లు, కార్యకర్తలకు నిప్పు రగిలింది ఇక్కడే.. తమ తమ పార్టీ అభ్యర్థుల



మద్దతు కోసం చేస్తున్న ప్రయత్నంలో రెండు పార్టీల మధ్య ఘర్షణ మొదలైంది. ఇద్దరు వ్యక్తుల మధ్య మొదలైన చిన్న ఘర్షణ గ్రామంలోని ఇరు పార్టీలకు సంబంధించిన కార్యకర్తలు బాహాబాహీకి దిగేంతవరకు వెళ్లడంతో చాలా మందికి గాయాల య్యాయి. ఇక్కడ ఉన్న పోలీస్ సిబ్బంది అదుపు చేయడంలో విఫలమయ్యారు. దీంతో మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న జంగిలిగొండ గ్రామానికి స్పెషల్ ఫోర్స్, బ్లాక్ కమెండోస్ రంగంలోకి దిగారు. ప్రత్యేక ద్విచక్ర వాహనాలపై వచ్చి గ్రామాన్ని దిగ్బందం చేశారు. అదుపుతప్పిన శాంతి భద్రతలను కాపాడేందుకు లాఠీఛార్జీ చేసి 144 సెక్షన్ విధించారు. అంతేగాక గ్రామాన్ని జల్లడపట్టి ఇరుపార్టీల లీడర్లు 12మందిపై కేసు నమోదు చేశారు. అప్పట్లో ఈ సంఘటన జిల్లా వ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది.

## ప్రాణం తీసిన శిఖార్ తుపాకీ..!

గ్రామానికి చెందిన గుండెల రాజయ్య అనే వ్యక్తి దగ్గర శిఖార్‌తుపాకీ ఉండేది. పక్షులను, జంతువులను వేటాడే వాడు.. సుమారు 1945 సంవత్సరంలో ఒక రోజు పౌర్ణమి నాటి రాత్రి శిఖార్ కోసం పాత చెరువు ప్రక్కన నుండి వెళ్తుండగా గుబురుగా ఉన్న సలేంద్రపు చెట్లమాటునుండి వింతశబ్ధాలు రావడంతో క్షణం పాటు భయాందోళనకు గురైన రాజయ్య ఆ పోదలవైపు చూడగా చెట్లు కదులుతూ బయం కొలుపే ఏడుపు రావడంతో ఏదో దెయ్యంగా



భావించాడు. రాజయ్య తన ప్రాణాలను రక్షించుకునేందుకు ఆనాలోచితంగా ఆయన దగ్గర ఉన్న తూపాకి ఆ పోదలవైపు గురిపెట్టి కాల్చాడు. ఆ తర్వాత ఆటువైపు శబ్దం ఆగి పోవడంతో దైర్యం చేసి పొదల్లోకి వెళ్లి చేశాడు. సలేంద్రపు పోదల్లో చిక్కుకున్న మహిళ శవం చూసి భయాందోళనకు గురయ్యాడు. విషయం తెలుసుకోగా రోటిబండతండాకు చెందిన మహిళ బహిర్భూమికి వెళ్లి సలేంద్రపు చెట్ల పోదల్లో చిక్కుక్కొని బయటకు వచ్చే మార్గం లేక సహాయం కోసం అరచి.. అరచి.. స్వరం మారింది. దెయ్యం గొంతుగా భావించి ఒక నిండు ప్రాణం తీశాననే బయం కల్గిన రాజయ్య ఆదే రోజు రాత్రి కుటుంబ సభ్యులతో కొంత కాలం ఊరు వదిలి వెళ్లిపోయినట్లు ప్రచారం ఉంది.





## బందిపోటు 'దొంగల' కలకలం

రోటిబండతండాకు చెందిన అజ్మీర బాల్యానాయక్ జంగిలిగొండ క్రాస్ రోడ్ వద్ద ఇల్లు నిర్మించుకుని నివాసం ఉన్నాడు. ఆయన ఇల్లు ఒక్కటే ఉండటంతో 1989లో ఆరుగురు బందిపోటు దొంగలు అర్థరాత్రి దాడి చేశారు. ప్రతిఘటించిన ఆయన భార్య ద్వాలీ వారి నుండి తప్పించుకుని దూదియాతండాకు వెళ్లి తండావాసులను తీసుకుని వచ్చింది. వీరిని చూసి బందిపోటు దొంగలు పరార్ కావడంతో వెంబడించి ఒక్కరిని పట్టుకుని చితకబాదారు. మరుసటి రోజు పోలీసులకు అప్పగించడంతో ఆ దొంగ మృతి చెందాడు. అప్పట్లో ఈ సంఘటన చర్చనీయాంశంగా మారింది. 1997లో విద్యాభారతి ప్రైవేట్ స్కూల్ ఏర్పాటు కావడంతో అప్పటి నుండి ఇక్కడ ఇండ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. దీంతో క్రాస్‌రోడ్ కాలనీ ఏర్పడింది. ప్రస్తుతం ఇక్కడ సుమారు 30పైగా ఇండ్లు వెలిశాయి.



దైర్యం ఒక ఆయుధం, ఇది జీవితమనే యుద్ధంలో ఎంతగానో సహాయపడుతుంది

## అందరివాడే.. కామ్రేడ్ పిట్టల అంజన్న



అభ్యుదయవాది.. పుట్టుకతో అంధుడైనా అందరికీ ఆరాధ్యుడై.. అందరివాడుగా నిలిచిన మంచి మనిషి ముదిరాజు ముద్దుబిడ్డ కామ్రేడ్ పిట్టల అంజయ్య. కళ్లు లేకున్నా తన మేధోశక్తితో.. స్పర్శతో.. ఎదుటి వ్యక్తులను గుర్తించడమే కాకుండా సమాజాన్ని చదివిన కమ్యూనిస్టువాది. తనకుతాను పాటలు కైకట్టి పాడేవాడు. ఆ పాటలతో అందర్నీ అలరించేవాడు. పాట కోసం గ్రామస్తులు అంజయ్యను పిలిపించుకుని పాడించి ఆనందించేవారు. జంగిలిగొండ-కొత్తూర్ జంట గ్రామాల్లో ఎవరు బావిలో పడినా.. చెరువులో పడినా ఆయనే కాపాడేవాడు. ఏడు కండాల లోతులోని మంచినీటి బావిలో బొక్కెనలు పడ్డా, ఇతర వస్తువుల పడినా చాలాసేపు శ్వాసను నియంత్రిస్తూ అంజయ్య బావిలోకి దిగి బయటకు తీసుకువచ్చేవాడు. ఎవరి నుండి నయాపైసా ఆశించకుండా అందరికీ చేదోడువాదోడుగా ఉండేవాడు కామ్రేడ్ అంజన్న..!

## వింతలూ.. విశేషాలు..!


గ్రామంలో మొట్టమొదటి సారిగా రేడియో, సైకిల్ కొన్న ఘనత పంజాల (పంతులు) నారాయణది. అంతేగాక



మొట్టమొదటి కెమెరా కూడా ఆయనదే. తొలిటీవీ కొనుగోలు చేసింది, తొలి మోటార్ సైకిల్(ఎస్‌డీ) దేవరం వెంకట్‌రెడ్డి. తొలి ట్రాక్టర్ చావ కృష్ణయ్యది. రవాణ సౌకర్యాలు లేని ఆ రోజుల్లో గుర్రపు బగ్గిలో ప్రయాణించిన మొదటి వ్యక్తి కొండపల్లి రామయ్య. పూర్తి ఆయురారోగ్యాలతో 105 ఏండ్లు జీవించిన శతాధిక వృద్ధుడు



గోల్కొండ కన్నయ్య గౌడ్. గ్రామానికి చెందిన ఒకే పేరుగల ఆలుమగలు మాచర్ల రామయ్య -రామక్క, పులి ముత్తిలింగయ్య-ముత్తిలింగమ్మ, గుండెల వీరయ్య-వీరమ్మ, ఒకే పోలికలతో తోటికోడళ్ల పేర్లు : దేవరం కరుణ- దేవరం అరుణ. గ్రామానికి చెందిన కవలలు: పోతుగంటి రామయ్య-లక్ష్మయ్య, పంజాల రామ్-శ్యామ్, గుడిసె జస్విక్-జస్విన్, పోతుగంటి రామ్- లావణ్య, పులి రామ్-లక్ష్మణ్, కాశిమల్ల రోహిన్ చంద్ర - రోహిత్‌చంద్ర, అలువాల యాశ్-దేవ్. ఒకే పేరు తో ఉన్న తండ్రి




కన్నయ్యగౌడ్

కొడుకులు: తండ్రి కొమ్మరాజుల మల్లయ్య కొడుకు కొమ్మరాజుల మల్లయ్య, తండ్రి శివరాత్రి మల్లయ్య కొడుకు శివరాత్రి మల్లయ్య, ఒకేపేరు తో ఉన్న అన్నదమ్ములు : పులిపెద్ద సాయిలు, పులినడిపి సాయిలు.


## సామాజిక సేవలో..



గోపమ్మ



రంగయ్య



వీరయ్య

గ్రామంలో పూర్వం వైద్యం అందుబాటులో లేక పోవడంతో ఎంతో మంది మాతృమూర్తులకు పురుడు పోసిన గ్రామీణ వైద్యురాలు మంత్రసాని జెట్టి గోపమ్మ. అంతేగాక బోయిని వెంకటయ్య రంగయ్య, వీరయ్యలు పాము కాటుకు,



ఐలయ్య

తేలు కాటుకు నాటు వైద్యం చేసి ఎంతో మందికి ప్రాణదానం చేసి రక్షించేవారు. అలాగే పశువులకు కూడా వైద్యం చేసేవారు. పెరుమాండ్ల ఐలయ్య గ్రామంలో ప్రమాదవశాత్తు కాళ్లు, చేతులు, నడుము విరిగిన వారికి కట్లు కట్టి




చంద్రయ్య

ఆరోగ్యవంతుల్ని చేసేవాడు. చిన్న పిల్లలకు సంధులు వచ్చినప్పుడు గుండెల వీరమ్మ నాటు వైద్యం చేసేది. వైద్య రంగం అంతగా అభివృద్ధి చెందని ఆ కాలంలో నాటు వైద్యమే ప్రజలకు దిక్కు. చెరువు నీరుటిగా కొమ్మరాజుల పెద్ద చంద్రయ్య పని చేశాడు. ఆరడుగుల ఎత్తు మీసాల రాయుడని పిలిచేవారు. చెరువులోని ప్రతి నీటిబొట్టు పంట పోలాలకు అందేలా నిరంతరం శ్రమించేవాడు.


# మన ఊరి ప్రదేశాలు


ఎర్రజెండాల సెంటర్/బొడ్రాయి సెంటర్

గ్రామంలో 1985లో సీపీఐ పార్టీ జెండా గద్దెను దేవరం ప్రకాశ్‌రెడ్డి ఏర్పాటు చేయడంతో నాటి నుండి ఎర్రజెండాల సెంటర్‌గా పేరు వచ్చింది. 2016లో బొడ్రాయి ప్రతిష్టాపన చేసిన తర్వాత బొడ్రాయి సెంటర్‌గా పిలుస్తున్నారు. గ్రామానికి మధ్యలో రావి చెట్టు ఉండటంతో రావి చెట్టు సెంటర్‌గా పేరు స్థిరపడింది. అంతేగాక పంచాయతీ ఆఫీసు లేని రోజుల్లో


పందిరి బోడ్

గ్రామానికి సంబంధించిన సమస్యలపై ఇక్కడే సమావేశాలు జరిగేవి. ఊరికి ఉత్తర భాగంలోని ఎర్రబోళ్లకు వెళ్లే డొంకదారి వద్ద పెద్ద మర్రివృక్షం ఉండటంతో దెయ్యాల మర్రిగా పేరొచ్చింది. పాత చెరువు నుండి పంటపొలాలకు పోయే అలుగు కాలువ వద్ద మర్రిచెట్టు ఉండటంతో అలుగుగడ్డమర్రిగా పిలుస్తుంటారు. ఊరగుట్ట-దొంతురాళ్లబోడ్ మధ్యలో ఉన్న పందిరిబోడ్‌పైన కోనేరు ఉంది. అయితే దేవుడు ఉన్నాడనే నమ్మకంతో అప్పట్లో నేరడ హైస్కూల్‌కు వెళ్లే మనగ్రామ విద్యార్థులు కోనేరును దర్శించుకుని నీళ్లు తాగేవారు. దొంతురాళ్లబోడ్ పైన పెద్దపెద్ద బండరాళ్లమధ్య 'బయ్యారం.. నేల బయ్యారం' అనే పేర్లు గల రెండు గుహలు ఉండేవి. ఈ గుహల్లో గబ్బిలాలు


దొంతురాళ్ల బోడ్


అలుగడ్డమర్రి

నివాసం ఉండేవి. విద్యార్థులు, పశువుల కాపర్లు ఆటవిడుపు చర్యగా గుహలను ఛేదించుకుంటూ బయటకు వెళ్లేవారు.

## మారుపేర్లు (నిక్ నేమ్‌లు)

గ్రామంలో ఎత్తుగా ఉన్న పైండ్ల నర్సయ్యను గేడి నర్సయ్యగా పిలిచేవారు. లావుగా ఉన్న కొమ్మరాజుల యాక య్యను బొర్ర యాకయ్యగా పిలుస్తుంటారు. ఊరబర్లు కాసిన పరాల వెంకయ్యను బర్ల వెంకయ్యగా, పోస్ట్ టప్పాను తీసుకెళ్లే యాఖూబ్‌అలీని టప్పా యాఖూబ్ అని పిలిచేవారు. జక్క నారాయణలు ఇద్దరు ఉండడంతో సూరత్‌లో పని చేసిన నారాయణకు సూరత్ నారాయణగా పేరు స్థిరపడింది. కొయ్యల వెంకన్నలు ఇద్దరు ఉండటంతో ఆరు వేళ్లు ఉన్న వెంకన్నను ఆరేళ్ల వెంకన్నగా, పంజాల లింగమూర్తులు ముగ్గురు ఉండటంతో పంతులు లింగమూర్తి, ఎర్ర లింగమూర్తి, కాలనీ లింగమూర్తులుగా, గోల్కొండ వెంకన్నలు నలుగురు ఉండటం తో డిష్ వెంకన్న, మద్దెల వెంకన్న, నెక్కొండ వెంకన్న, పెద్ద వెంకన్నలుగా పిలుస్తారు. గోల్కొండ రమేశ్‌లు ఇద్దరు ఉండటం తో ఒకరిని డిష్ రమేశ్‌గా, ఇరుగు వెంకన్నలు ఇద్దరు ఉండటం తో ఒకరిని డ్రైవర్ వెంకన్నగా, గుడిసె వెంకటయ్యలు ఇద్దరు ఉండటంతో కాలనీ వెంకటయ్య అని ఒకరిని పిలుస్తున్నారు. గుర్రాల పెంటయ్యలు ఇద్దరు ఉండగా ఒకరిని మీసాల పెంటయ్యగా, కొమరాజుల వెంకన్నలు ముగ్గురు ఉండగా ఒకరిని డాక్టర్ వెంకన్న, కోదాడు నుండి వచ్చిన గుండెల మల్లమ్మను కోదాడు మల్లమ్మగా, శివరాత్రి వెంకన్నలు ఇద్దరు ఉండగా ఒకరిని ఎల్ఐసీ వెంకన్నగా పిలుస్తారు. బుడిగబోయిన లక్ష్మినర్సులు ఇద్దరు ఉండగా కర్రె లక్ష్మినర్సు, మరొకరిని నత్తి లక్ష్మినర్సుగా, ముప్పు ముత్తయ్యలు ఇద్దరు ఉండగా ఒక్కరిని ఎర్ర ముత్తయ్య, మరొకరి కర్రె ముత్తయ్యగా పిలుచేవారు. ఎర్రం వీరయ్య పూర్వం గానుగను తిప్పే వృత్తి చేసేవాడు. ఇంటిపేరు గా నుగగా మారి గాండ్ల వీరయ్యగా పేరు స్థిరపడింది. మోద్గుపురం బిక్షంను గ్రామస్తులు రాష్ట్రపతి అనే పేరుతో పిలిచేవారు...

## చనిపోయి.. బతికిన వీరమ్మ..!



గ్రామానికి చెందిన గుండెల వీరమ్మ కాన్పు కోసం 1975లో తన పుట్టిల్లు కేసముద్రం మండలం అర్పనపల్లికి వెళ్లింది. ఆడబిడ్డకు జన్మనిచ్చిన అనంతరం పదకొండవ రోజు నాటికి తీవ్ర అనారోగ్యానికి గురై తెల్లవారుజామున అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఎంతకూ స్పృహలోకి రాకపోవడంతో మరణించింది అనుకుని కుటుంబ సభ్యులు బంధువులకు సమాచారం అందించి స్వర్గలోక ప్రాప్తికోసం వరిగడ్డి వేసి కిందపడుకోబెట్టారు. సాయంత్రం సమయంలో దహన సంస్కారానికి ఏర్పాట్లు చేసుకుంటున్న క్రమంలో బంధువుల ఆర్తనాధాలు, రోధనలు విని స్పృహలోకి వచ్చిన వీరమ్మను చూసి అందరూ సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. చనిపోయి బతికిన వీరమ్మను చూసిన బంధుమిత్రులు ఇదంతా దేవుడి లీలగా భావించారు. కొన్ని సంవత్సరాలకు రమణ, రాజులకు జన్మనిచ్చి సంపూర్ణ ఆయురారోగ్యాలతో వీరమ్మ 2009లో స్వర్గస్తులయ్యారు.




జంగిలిగొండ గ్రామం పూర్వం కేసముద్రం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండేది. అయితే 1991లో మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి మార్చారు. కాగా జూలై 30, 2003 నుండి మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు మారింది. తొలి మహబూబాబాద్ రూరల్ ఎస్ఐ గా కె. శివ సాంబ రెడ్డి పని చేశారు.



## భూముల రకాలు



ఎర్ర నేలలు

గ్రామంలో భౌగోళిక ప్రాంతం మొత్తం 3,309.34 ఎకరాలు భూమి ఉండగా అందులో 1,391.37ఎకరాలు సాగు భూములు ఉన్నాయి. అందులో తరి 1,138 ఎకరాలు, మెట్ట 253 ఎకరాల భూములు ఉన్నాయి. నల్ల రేగడి 389.6 ఎకరాలు, ఎర్ర నేలలు 667.8 ఎకరాలు, చౌడుభూములు 139.1 ఎకరాలు, ఒండ్రు నేలలు 125.2ఎకరాలు, ఏనెలతో కూడిన గుట్టలు 69.6 ఎకరాలు భూములు ఉన్నాయి. ప్రస్తుతం రైతులు వరి, పత్తి, మిరప, మొక్కజొన్నలతో పాటు మామిడి, ఆయిల్‌ఫాం, మల్బరీ తోటలు సాగు చేస్తున్నారు.



తరి భూములు

గ్రామానికి చెందిన దేవరం వెంకట్ రెడ్డి భూసార యాజమాన్య పద్దతులలో నూతన వ్యవసాయ విధానంతో పంటలు సాగు చేశారు. 1990లో గ్రామంలోనే తొలిసారిగా పట్టు పురుగుల పెంపకం చేపట్టి బెంగుళూర్ వెళ్లి విక్రయించేవారు. అంతేగాక జీలుగు పంటలు సాగు చేశారు. ఖాదర్‌వలి విధానంలో ఐదురకాల సిరిధాన్యాలైన కొర్రలు, అండుకొర్రలు, సామలు, ఊదలు, అరికలు సాగు చేసేవారు. 2000ఏడాదిలో మహారాష్ట్రకు చెందిన సుభాశ్ సాలెకర్ గారి విధానంలో ఆవుపేడ, మూత్ర ద్రావణంతో జీవామృతం తయారీ చేశారు. అంతేగాక కూరగాయలు ఇతర పంటలు సాగు చేసి గ్రామంలోనే తొలి సారిగా కొత్త రకం పంటలు సాగు చేశారు.



ఖుష్కీ భూములు

గ్రామంలో మొత్తం 673 మంది రైతులు ఉండగా రైతు భీమా పథకానికి 537మంది రైతులు ఎంపికయ్యారు. 59 ఏళ్లకంటే ఎక్కువగా ఉన్న 128 మంది రైతులు అనర్హులుగా ఉన్నారు. ఇప్పటి వరకు 9 మందికి రైతుభీమా వర్తించింది. కాంగ్రెస్ హయాంలో ఏర్పాటు చేసిన ఆదర్శ రైతులు 2007 నుండి 2014 వరకు గ్రామానికి చెందిన పైండ్ల వీరన్న, బైరోజు వెంకటాచారిలు సేవలు అందించారు. తర్వాత టీఆర్ఎస్ ప్రభుత్వం ఆధర్శ రైతుల విధానాన్ని రద్దు చేసింది. 2018 నుం


ఆవుపేడ-మూత్రంతో జీవామృతం తయారీ

డి రైతు సమన్వయ సమితిలను తీసుకవచ్చింది. మండల కమిటీ సభ్యుడిగా పంజాల యాకసాయిలు, గ్రామ కోఆర్డినేటర్‌గా గోల్కొండ శ్రీనివాస్, ఏఈఓగా రాజ్యలక్ష్మిలు కొనసాగుతున్నారు.


2001లో ప్రభుత్వం కోనుగోలు చేసిన భూమి ఇదే

రెవెన్యూ అధికారులు గ్రామ సభలు నిర్వహించి 172 మందికి పట్టాలిచ్చారు. అయితే అనర్హులు ఉన్నారనే ఆరోపణలతో అధికారులు పట్టాలను రద్దు చేశారు. ఈ భూమిలో సబ్‌స్టేషన్, జీపీ, నర్సరీ, పల్లెప్రగతి, వాటర్‌ట్యాంక్ కోసం కేటాయించారు. కొంత భూమిలో కాటమయ్య దేవాలయం ఏర్పాటుతో పాటు మరి కొందరు ఇండ్లు వేసుకుని నివాసం ఉంటున్నారు. గ్రామంలో భూపంపిణీ పథకం కింద 2016లో 11మంది దళితులకు 3ఎకరాల చొప్పున ప్రభుత్వం భూమిని కొనుగోలు చేసి పంపిణీ చేసింది. వీఆర్ఏగా గ్రామానికి చెందిన గుర్రాల విద్యాసాగర్ కొనసాగుతున్నారు.

## ప్రభుత్వ భూములు


ప్రభుత్వ భూములు

గ్రామంలో పోరంబోకు, ఖారజఖాత, గెట్‌నెంబర్, బంచరాయి, సర్కారి, అసైన్డ్‌మెంట్ మొత్తం 558.11 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. అందులో 209.15 ఎకరాల భూమిని అసైన్డ్‌మెంట్ చేసి 165 మంది నిరుపేదలకు పంపిణీ చేశారు. ఇంకా 348.36 ఎకరాల ప్రభుత్వ భూమి బ్యాలెన్స్ ఉంది. గ్రామంలో 44.21ఎకరాల సీలింగ్ భూమిని 38మంది నిరుపేదలకు పంపిణీ చేశారు. 2001లో సర్వేనెంబర్లు 210/2, 210/4, 217/2, 217/3లలో 4 ఎకరాల భూమిని నివాస స్థలాల కోసం ఎకరానికి రూ.40వేల చొప్పున మొత్తం రూ.1.60లక్షల నిధులతో ప్రభుత్వం కొనుగోలు చేసింది.

## నీటి వనరులు


ఎస్సారెస్పీ ఉప కాలువ

గ్రామంలో వ్యవసాయం వర్షాధారంగా చేస్తున్నారు. తరి (వరి) పంటలు పూర్తిగా బోరుబావుల ద్వారానే సాగువుతుంది. గ్రామంలో ఒక చెరువు, రెండు కుంటలు ఉన్నాయి. అయితే తూర్పున ఉన్న సర్వేనెంబర్ 82లోని ప్రభుత్వ భూమిలో కింది కుంట, పైకుంటలు ఉండేవి. గత కొంత కాలం క్రితం రైతులు గండి కొట్టి సాగు చేస్తున్నారు. దీంతో అ రెండు కుంటలు కనుమరుగయ్యాయి. ప్రస్తుతం గ్రామంలో ఒక్కటే చెరువుంది. తూర్పున ఉన్న పాత చెరువుకు 47సర్వేనెంబర్‌లోని 89.33 శిఖం భూమి ఉండగా 121.25 ఎకరాలు ఎఫ్‌టీఎల్ ఉంది. చెరువు కింద 224 ఎకరాల ఆయకట్టు ఉంది. 33.09 ఎంసీఎఫ్‌టీ నీటి సామర్థ్యం ఉంది. ఎస్సారెస్పీ డీబీఎం-48 కింద21 ఆర్



ఉప కాలువ ద్వారా పాత చెరువుకు నీరు వస్తుంది. గ్రామంలోని రైతులు భూ గర్భంలోని నీటిని బోర్లు, బావుల ద్వారా నీటిని తోడి వ్యవసాయం చేస్తున్నారు. గ్రామంలోని 24 బోర్లతో 168 ఎకరాలు, 348 బావుల ద్వారా 970ఎకరాలు సాగుచేస్తున్నారు. నైబుతిలో కట్టుకాలువ, పంటపొలాలు విస్తరించి ఉన్నాయి. బిళ్ళల్లకుంట కనుమరుగైంది. జిల్లేలవాగు, సాకలేరివాగుల ద్వారా వీఎస్ లక్ష్మీపురం కొత్తచెరువుకు నీరు వెళ్తుంది. పాత చెరువు నుండి కట్టుకాలువ వెళ్లే వాగును వడ్లోనివాగుగా పిలుస్తున్నారు. బుడ్డబందం వాగు ఉంది. భూగర్భ జలాలు పెరగడంతో వీటి ప్రక్కన ఉన్న బోర్లు, బావులకు నీటి కొరత తీరుతుంది.



వడ్లోని వాగు

డీబీఎం-48 నర్సింహుల గూడెం, అమనగల్లు, జంగిలిగొండ 16ఆర్ టీసీ ఎన్నికల్లో నెంబర్గా 2003లో దేవరం ప్రకాశ్ రెడ్డి గెలిపొందారు. పాతచెరువు ఆయకట్టు కింద ఉన్న సాగు రైతులతో నీటి తీరువా సంఘాలను ఏర్పాటు చేశారు. 1995 నుండి 2009 వరకు నీటి సంఘాలు కొనసాగాయి. తొలి నీటి సంఘం ఛైర్మన్గా కొండపల్లి రాంచందర్రావు 1995 నుండి 2000 వరకు, జక్క చిన్న నారాయణ 2000 నుండి 2003 వరకు, బైరోజు నారాయణ 2003 నుండి 2006 వరకు, శివరాత్రి లక్ష్మయ్య 2006 నుండి 2009 వరకు ఛైర్మన్గా పని చేశారు. తర్వాత నీటి తీరువా సంఘాలను ప్రభుత్వం రద్దు చేసింది.



కనుమరుగైన కింది కుంట

## Mineral Resources
## ఖనిజ వనరులు


గ్రామంలో ఖనిజ వనరులు ప్రత్యేకంగా ఏమి లేకపోవడంతో ప్రభుత్వానికి, గ్రామ పంచాయతీకి ఎలాంటి ఆదాయం లేదు. ఊరగుట్ట, దొంతురాళ్లబోడ్, పందిరిబోడ్, అడ్డగుట్టలు ఉన్నాయి. దొంతురాళ్లబోడ్కు గతంలో క్రషర్మిల్లు ఏర్పా టు చేసి, కొంత కాలం తర్వాత 2012లో బంద్ చేశారు



ఊరగుట్ట



దొంతురాళ్లబోడ్



పందిరిబోడ్



అడ్డగుట్ట(శ్రీఅంజనేయ స్వామి వెలసిన అడ్డగుట్ట)



ఓర్పులేని మనిషి.. నూనెలేని దీపం వంటివాడు : పెగోనియా

## జనాభా.. కుటుంబాలు... ఓటర్లు.

2021 లెక్కల ప్రకారం గ్రామంలో మొత్తం 358 కుటుంబాలు ఉన్నాయి. అందులో గౌడ్స్-76, ముదిరాజ్-69, వడ్డెర-50, మాదిగ-33, రజక-28, రెడ్డి-25, యాదవ్-15, మేర-15, మున్నూరు కాపు-14, మాల-11, విశ్వబ్రాహ్మణ-9, కుమ్మరి-03, వైశ్యులు-03, సిందు-03, కమ్మ-02, ముస్లిం-02 చొప్పున కుటుంబాలు ఉన్నాయి. గ్రామం మొత్తం 1,306 మంది జనాభా కల్గి ఉంది. అందులో 655 మంది స్త్రీలు, 651 మంది పురుషులు ఉన్నారు. ఎస్సీల్లో మొత్తం 209 మంది ఉండగా110 మంది స్త్రీలు, 99 మంది పురుషులు, బీసీల్లో మొత్తం 1023 మంది ఉండగా అందులో 511 మంది స్త్రీలు, 512మంది పురుషులు, ఇతర కులాల్లో మొత్తం 71మంది ఉండగా అందులో 32మంది స్త్రీలు, 39మంది పురుషులు ఉన్నారు. మొత్తం గ్రామంలో 1,019 మంది ఓటర్లు ఉండగా అందులో స్త్రీలు 522 మంది, పురుషులు 497 మంది ఉన్నారు.

## ప్రజా రవాణా సౌకర్యాలు



జంగిలిగొండ బస్టాండ్

బస్సు, ఆటోలే ప్రజా రవాణా సౌకర్యాలు. గతంలో ప్రైవేట్ బస్సులు (ఎర్ర బస్సు) వచ్చేవి. అయితే 1983 నుండి ఆర్టీసీ బస్సులు గ్రామానికి వస్తున్నాయి. మహబూబాబాద్ నుండి గ్రామానికి ఉదయం 6.30 గంటలకు జంగిలిగొండ మీదుగా నర్సింహులపేట వెళ్లేందుకు బస్సులు ఉన్నాయి. మహబూబాబాద్ డిపో బస్సు మహబూబాబాద్ నుంచి నర్సింహులపేట వరకు రోజుకు రెండు ట్రిప్పులు తిరుగు తంది. గ్రామంలో 8 ఆటోలున్నాయి. ప్రతి రోజూ మహబూబా బాద్‌కు తిరుగుతునే ఉంటాయి. అంతేగాక జంగిలిగొండ క్రాస్ రోడ్డు నుండి మహబూబాబాద్-సూర్యపేట, దంతాలపల్లి- వంత దపల నేరడ - తట్టు పల్లి వేళ్లే బస్సులు క్రాస్ రోడ్ నుండి వెళ్తుంటా యి. గ్రామానికి రెండు కిలో మీటర్ల దూరంలో క్రాస్‌రోడ్ ఉంది. జిల్లా కేంద్రానికి ఈ గ్రామం నుండి 15.5కిలో మీటర్లు, హైదరాబాద్‌కు 192కిలో మీటర్ల దూరం ఉంది.



జంగిలిగొండ క్రాస్ రోడ్ సెంటర్



జంగిలిగొండకు వెళ్లే రహదారి

## రహదార్ల సౌకర్యాలు



అమనగల్లు వెళ్లే రహదారి

జిల్లా కేంద్రం నుండి గ్రామానికి తారు రోడ్డు సౌకర్యం ఉంది. ప్రక్కనున్న అమనగల్లు వయా గుండాలగడ్డతండా గ్రామానికి వెళ్లడానికి మట్టి రోడ్డు మాత్రమే ఉంది. ప్రక్కన ఉన్న చిన్నగూడూర్, నర్సింహులపేట, కురవి, మండల కేంద్రాలకు వెళ్లేందుకు తారు రోడ్లు ఉన్నాయి. గ్రామం నుండి రోటిబండ తండా, దూదియాతండాలకు రోడ్డు లేదు. క్రాస్ రోడ్డు నుం డి వెళ్తే అధనంగా నాలుగు కిలో మీటర్లు దూరం ఉంటుంది.

## పార్టీల పరిస్థితులపై రాజకీయ విశ్లేషణ

జంగిలిగొండ ఉమ్మడి పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన వార్డుమెంబర్లు సర్పంచులను ఎన్నికునేవారు. వీఎస్ లక్ష్మీపురం (కొత్తూర్)-జంగిలిగొండ ఉమ్మడి పంచాయతీలో కాంగ్రెస్ పార్టీదే పైచెయ్యి. గ్రామంలో మొదటి పంచాయతీ ఎన్నిక లు1960లో జరిగాయి. కాంగ్రెస్ పార్టీ నుండి ఏకగ్రీవంగా ఎన్నికైన కొమ్ము సత్యం సర్పంచిగా, దేవరం వెంకట్‌రెడ్డి ఉప సర్పంచిగా 1960 నుండి 1970వరకు రెండు సార్లు కొన సాగారు. 1970లో జంగిలిగొండ గ్రామ ప్రత్యేక పంచాయతీ ఏర్పడింది. మొదటి సర్పంచిగా రామసహాయం సత్యనారాయణ రెడ్డి ఎన్నికయ్యారు. మూడెళ్ల తరువాత కాంగ్రెస్ పార్టీలో ఉన్న వర్గపోరులో రెండు వర్గాలకు అనుకూలంగా ఉన్న పంజాల వీర య్యను సర్పంచిగా ఎన్నుకొవడంతో 1972 నుండి 1981 వర కు కొనసాగారు. 1981లో గ్రామ పంచాయతీ డైరెక్టు సర్పంచి ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీ నుండి దేవరం వెంకట్‌రెడ్డి



సర్పంచి అభ్యర్థిగా, ఆరుగురు వార్డు సభ్యులుగా నామినేషన్లు వేశారు, చివరి రోజు చావ కృష్ణయ్య మద్దతుతో సర్పంచి అభ్యర్థిగా గిరగాని నారాయణను బరిలోకి దించారు. వార్డు సభ్యులకు పోటీదార్లు లేకపోవడంతో దేవరం వెంకట్‌రెడ్డి మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సర్పంచి అభ్యర్థులకు జరిగిన ఎన్నికల్లో గిరగాని నారాయణపై దేవరం వెంకట్‌రెడ్డి గెలుపొంది 1981నుండి 1988 వరకు కొనసాగారు. జనతా పార్టీకి మద్దతుగా ఉన్న చావ కృష్ణయ్య గిరగాని నారాయణలతో పాటు మరి కొందరు 1982లో ఆవిర్భవించిన టీడీపీ పార్టీలో చేరారు. 1988, 1995లో రెండు సార్లు జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కొండపల్లి రాంచందర్‌రావు గెలిపొందారు. 1988లో పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ పార్టీ నుండి కొండపల్లి రాంచందర్‌రావు, కాంగ్రెస్ పార్టీ మద్దతుతో సీపీఐ పార్టీ నుండి దేవరం ప్రకాశ్‌రెడ్డి బరిలో ఉన్నారు. 1995లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సీపీఐ పార్టీ మద్దతుతో టీడీపీ పార్టీ సర్పంచి అభ్యర్థి కొండపల్లి రాంచందర్‌రావు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా దేవరం ప్రకాశ్‌రెడ్డి ఇద్దరు పోటీపడ్డారు. కొండపల్లి రాంచందర్‌రావు టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడిగా 1995 నుండి 2018వరకు కొనసాగి, 2019లో జిల్లా అధ్యక్షుడిగా, 2020 నుండి పార్లమెంటరీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. సీపీఐ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిన దేవరం ప్రకాశ్‌రెడ్డి 1995 నుండి 2020 వరకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా కొనసాగి, ప్రస్తుతం జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకుడిగా కొనసాగుతున్నారు. అయితే ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, టీడీపీ పార్టీల మండల అధ్యక్షులుగా దేవరం ప్రకాశ్‌రెడ్డి, కొండపల్లి రాంచందర్‌రావుల ఎన్నికతో జంగిలిగొండకు మరింత ప్రాధాన్యత పెరిగింది. సీపీఐ పార్టీ గ్రామ కార్యదర్శులుగా పని చేసిన మిర్యాల సత్తిరెడ్డి, కాశిమల్ల బిక్షం టీఆర్ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీలో పని





చేసిన రణబోత్ శ్రీనివాస్‌రెడ్డి 1997లో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీలో పని చేసి, 2000లో మళ్లీ కాంగ్రెస్‌లో చేరి, 2014లో టీఆర్ఎస్‌లో చేరారు. ప్రస్తుతం 2019నుండి బీజేపీలో చేరి కొనసాగుతున్నారు. సీపీఐలో పని చేసిన పంజాల యాకసాయిలు టీఆర్ఎస్‌లో చేరి మండల ఉపాధ్యక్షుడిగా పని చేశారు. 2006లో టీడీపీ పార్టీ మద్దతుతో టీఆర్ఎస్ అభ్యర్థి పంజాల పద్మ సర్పంచిగా గెలిపొందారు. 2019లో ఎంపీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతో గెలిచిన టీడీపీ అభ్యర్థి కొండపల్లి రాంచంద్రమ్మ ఎంపీపీ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయడంతోనే టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మహబూబాబాద్ ఎంపీపీగా పీఠం దక్కింది. ఒక్క ఓటుతోనే మండల రాజకీయాలు తారుమారయ్యాయి. ఆమెకు వ్యతిరేకంగా కాంగ్రెస్ శ్రేణులు అందోళనలు చేపట్టాయి. టీఆర్ఎస్ పార్టీ కొయ్యల కొమరెల్లి (అధ్యక్షుడు), కాంగ్రెస్ పార్టీ జెట్టి యాకన్న (అధ్యక్షుడు), టీడీపీ కొయ్యల శ్రీనివాస్ (అధ్యక్షుడు) బీజేపీ రణబోత్ శ్రీనివాస్‌రెడ్డి, ఇరుగు వెంకటేశ్ (నాయకులు), సీపీఎం పార్టీ పులి వెంకటేశ్వర్లు (నాయకుడు) పని చేస్తున్నారు.







## ప్రభుత్వ- ప్రైవేట్ విద్యాసౌకర్యాలు

జంగిలిగొండ ప్రాథమిక పాఠశాల క్రీస్తుశకం 1956లో ప్రారంభమైంది. మూడు గదులతతో భవనం రూపుదిద్దుకుంది. పెరిగిన విద్యార్థులకు అనుగుణంగా 2002లో మరొక అదనపు గది నిర్మాణం చేశారు. అయితే మూడు గదుల పాఠశాల భవన సముదాయం 2013 నాటికి శిథిలావస్థకు చేరుకుంది. దీంతో 2019లో ఆ మూడు గదుల భవనం పునః నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చారు. గ్రామ సర్పంచి యాక



ప్రభుత్వ స్కూల్ ప్రారంభం దృశ్యం

సాయిలు ఆధ్వర్యంలో దాతలు డాక్టర్ ఇంద్రసేనారెడ్డి, దారం నరేశ్ (ఏఈ), కార్తీక్ (టీచర్), దేవరం పురుషోత్తమరెడ్డిలు రూ.10వేలు, ఎంపీ మాలోత్ కవిత, పంజాల యాకసాయిలు (సర్పంచి), పంజాల లింగమూర్తి (టీచర్), పంజాల శ్రీనివాస్ (టీచర్), యాస వెంకట్‌రెడ్డి, పూజల సతీష్, కొమ్మరాజుల సంజీవ, కొమ్మరాజుల ఉమారాణిలు రూ.5వేల చొప్పున గ్రామానికి చెందిన మరి కొందరు విరాళాలు అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. స్కూల్‌కు రేకులు వేసి మరమ్మత్తు చేశారు. 2003 విద్యాసంవత్సరంలో రెండు వందల పైచిలుకు విద్యార్థులతో ఉన్న పాఠశాల 2014 వచ్చేసరికి 30మంది విద్యార్థులకు తగ్గింది. ప్రస్తుతం 2021 నాటికి 72 మంది విద్యార్థులతో ఇద్దరు టీచర్లు, డిప్యూటేషన్ పై వచ్చిన మరో టీచర్ కూడా పని చేస్తున్నారు. 1992 మార్చిలో బీసీ కాలనీ, ఎస్సీ కాలనీలకు అంగన్వాడి కేంద్రాలు మంజూరయ్యాయి. అంగన్వాడి కార్యకర్తలుగా పంజాల ఉపేంద్ర, పెరుమాండ్ల శ్రీలత పని చేస్తున్నారు. ఇద్దరు ఆయాలు విజయరాణి, సుగుణమ్మలు పని చేస్తున్నారు. 2013లో రూ.2.50 లక్షల నిధులతో అంగన్వాడి కేంద్ర భవనం నిర్మించారు. గ్రామంలో వయోజనవిద్య 1980లో ప్రారంభమైంది. దీనికి కాశిమల్ల బిక్షం1980-1982 వరకు బోదకులుగా పని చేశారు. 1982 నుండి 1984 వరకు గుర్రాల వీరయ్య, 1985 నుండి 1992వరకు అనుముల రమేశ్ బోదకులుగా పని చేశారు. 1993లో అనియతవిద్య వ్యవస్థ ఏర్పడింది. తొలి కోఆర్డినేటర్ గా పెరుమాండ్ల లింగమూర్తి



జంగిలిగొండ ప్రభుత్వ పాఠశాల



అంగన్వాడి కేంద్రం





స్కూల్ అధనపు తరగతి గదులు

పని చేశారు. 1994లో పులి సోమయ్య రోటిబండ తండాకు, ముప్పు వీరయ్య కేవుల తండాకు కోఆర్డి నేటర్లుగా కొనసాగారు. 2000లో గ్రామంలో అక్షరదీపికను ప్రారంభించారు. ప్రేరక్‌గా పైండ్ల వీరన్న 2000 నుండి 2004 వరకు కొనసాగారు. 2007లో సాక్షరభారతి ప్రారంభమైంది. 2007 నుండి 2014 వరకు గ్రామ కోఆర్డినేటర్లుగా గోల్కొండ వనజ, బానోత్ బాలకృష్ణలు కొనసాగారు. గ్రామంలో 1990లో నవీన్ విద్యాలయం కాశిమల్ల బిక్షం ఏర్పాటు చేసి రెండు సంవత్సరాలు కొనసాగించారు.1994లో ప్రగతి విద్యాలయం ప్రారంభమై1995 వరకు నిర్వహించారు. 1996 నుండి 2005 వరకు ప్రతిభ విద్యానికేతన్‌ను పంజాల శ్యాంసుందర్ (తండ్రి నారాయణ), కాశిమల్ల బిక్షం, అనుముల వెంకటేశ్వర్లు స్థాపించి 2005 వరకు నిర్వహించారు. క్రాస్ రోడ్‌లోని విజయభారతి ప్రైవేట్ స్కూల్ 1997లో ప్రారంభమై 2015 వరకు కొనసాగింది. 1999 నుండి ప్రాథమిక పాఠశాల విద్యాకమిటి ప్రారంభమైంది. అయితే 1999 నుండి 2003 వరకు పంజాల లింగమూర్తి, 2003 నుండి 2009 వరకు బైరోజు ప్రభావతి, 2009 నుండి 2011 వరకు మంద వీరయ్య, 2011 నుండి 2015 వరకు బోయిన భద్రయ్య, 2015 నుండి 2019 వరకు జిల్లెల సాయిలు, 2019 నుండి శ్యామకూరి సాగర్లు విద్యాకమిటి ఛైర్మన్లుగా కొనసాగుతున్నారు.

## తాగునీటి సరఫరా పద్ధతులు

గ్రామంలో నీటి సమస్య తీవ్రంగా ఉండేది. పూర్వం గ్రామస్తులు చెరువులు, వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి నీరు తెచ్చేవారు. 1990లో సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో కొత్త చెరువు



శిఖంలో శ్రమదానం చేసి మంచి నీటిబావిని తవ్వడం వల్ల కొంత గ్రామానికి ఉపయోగప డింది. చావ కృష్ణయ్య ఇంటిలో ఉన్న బావి, దేవరం వెంకట్‌రెడ్డి వ్యవసాయ బావులే ప్రజలకు తాగు నీరు అందించాయి. 1991లో కొండపల్లి రాంచందర్‌రావు సర్పంచి హయాంలో రూ.1.20 లక్షలతో మంచినీటి బావిని తవ్వించి, పైపులైన్ వేశారు. ఈ పైపులైన్ల ద్వారా ఒక్కోట్యాంకుకు రూ.40వేల చొప్పున నాలుగు మినీ ట్యాంకులు నిర్మించి, పబ్లిక్ నల్లాలతో సరఫరా చేసేవారు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉండటంతో 2001లో మరో మంచినీటి బావి, పైపులైను రూ.1.50లక్షల నిధులతో ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీ లీడర్ దేవరం ప్రకాశ్‌రెడ్డి కృషితో ఎంపీటీసీ సభ్యుడు దేవులనాయక్ బీసీకాలనీ కోసం రూ.40వేలతో మినీట్యాంకు నిర్మించారు. మినీట్యాంకుకు కనెక్ష న్ ఇచ్చేందుకు అప్పటి సర్పంచి రాంచందర్‌రావు నిరాక



రించారు. దీంతో కోపోద్రిక్తులైన బీసీ కాలనీ వాసులు సొంతంగా పైపులైను నుంచి కనెక్షన్ తీసుకున్నారు. పంచాయతీ సిబ్బంది ఫిర్యాదుతో గోల్కొండ నారాయణ, గుడిసె వెంకటయ్య, పైండ్ల యాదగిరి, పంజాల లింగమూర్తిలపై పోలీసులు కేసు నమోదు చేశారు. నీటిట్యాంకుల వద్ద, పబ్లిక్ నల్లాల వద్ద మహిళల మధ్య పెద్ద ఎత్తున గొడవలు, పంచాయతీలు జరిగేవి. బానోత్ వాలీ సర్పంచి అయిన తర్వాత నీటి సమస్య పరిష్కారం కోసం రైతుల బావులను లీజ్‌కు తీసుకుని పైపులైను వేయించి, నీటిని సరఫరా చేశారు. ఇంటింటికి నల్లా కనెక్షన్లు ఇచ్చారు. తాగునీటి సమస్యతో రూ.6లక్ష లతో చెరువు శిఖంలో మరో బావిని



తవ్వించా రు. దీంతో నీటి ఎద్దడి సమస్య కొంత వరకు తీరింది. ప్రస్తుతం మినీ ట్యాంకులు నిరుపయో గంగా ఉన్నాయి. 2003లో బీసీ కాలనీలో 40వేల లీటర్ల నీటిసా మర్థ్యం కల్గిన రూ.15లక్షల నిధులతో ఓహెచ్ఎస్ఆర్‌ను నిర్మించారు. 2019లో మిషన్ భగీరథ పథకంలో



ఎస్సీ కాలనీ వద్ద రూ.16 లక్షల నిధులతో 40వేల లీటర్ల నీటి సామర్థ్యం కల్గిన ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నిర్మించారు. గ్రామంలో ఉన్న మూడు బావుల్లో వర్షాకాలంలో ఒక్కటి, వేసవిలో రెండు బావుల నీటిని వినియోగిస్తున్నారు. గ్రామంలో మొత్తం 343 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. 167పాత నల్లా కనెక్షన్లు ఉండగా, మిషన్‌భగీరథ పథకంలో మరో 176 నల్లా కనెక్షన్లు ఇచ్చారు. గ్రామంలో మొత్తం 9.743 మీటర్ల పైపులైన్లు ఉండగా మిషన్ భగీరథ కింద మరో 1.987 మీటర్లు పైపులైన్లు వేశారు. మిషన్‌భగీరథ నీటితో పాటు మంచినీటి బావుల నీరు కూడా పంపిణీ చేస్తున్నారు. గ్రామంలో మొత్తం ఐదు చేతి పంపులు ఉన్నాయి. 2020లో శ్రీరామ మినరల్ వాటర్ ప్లాంటును పంజాల సురేశ్, పులి సోమయ్యలు ఏర్పాటు చేశారు. స్కూల్ విద్యార్థులకు, సబ్‌స్టేషన్ సిబ్బందికి ఉచితంగా మినరల్ వాటర్ సరఫరా చేస్తున్నారు.

## పంచాయతీ సర్పంచులు, సిబ్బంది వివరాలు

1959 సంవత్సరంలో జంగిలిగొండ ఉమ్మడి గ్రామ పంచాయతీ ఏర్పడింది. 1960లో పంచాయతీ ఎన్నికలు జరిగా యి. ఇప్పటి వరకు 11 సార్లు జరిగిన ఎన్నికల్లో మొత్తం 9 మంది సర్పంచులు ఎన్నికయ్యారు. 1960, 1965లో జరిగిన ఎన్నికల్లో వార్డు సభ్యులుగా ఎన్నికైన వార్డు మెంబర్లు సర్పంచిని ఎన్నుకు నేవారు. అయితే వీఎస్‌లక్ష్మీపురం గ్రామానికి చెందిన కొమ్ము సత్యం (కాంగ్రెస్) రెండు సార్లు సర్పంచిగా ఎన్నికయ్యా రు.1960 నుండి 1965 వరకు, 1965 నుంచి 1970 వరకు సర్పంచిగా కొమ్ము సత్యం పని చేశారు. రామసహాయం సత్యనారాయణరెడ్డి 1970 నుండి 1972 వరకు, పంజాల వీరయ్య 1972 నుండి 1981 మే నెల 18 వరకు పని చేశారు.




జంగిలిగొండ గ్రామ పంచాయతీ ఆఫీసు

1981నుండి గ్రామ సర్పంచి ఎన్నికలు డైరెక్ట్‌గా నిర్వహిస్తున్నారు. దేవరం వెంకట్‌రెడ్డి (కాంగ్రెస్) 1981 నుండి జనవరి 23, 1988 వరకు, కొండపల్లి రాంచందర్‌రావు (టీడీపీ) 1988 నుండి సెప్టెంబర్ 1995 వరకు, 1995 నుండి 14 ఆగస్టు 2001 వరకు, బానోత్ వాలీ (కాంగ్రెస్) 2001 నుండి 23 ఆగస్టు 2006 వరకు, పంజాల పద్మ (టీఆర్ఎస్) 2006 నుండి 22 ఆగస్టు 2011 వరకు, గోల్కొండ రాంచంద్రయ్య (కాంగ్రెస్) 2011నుండి 2018 వరకు కొనసాగారు. పంజాల యాకసాయిలు (టీఆర్ఎస్) సర్పంచిగా ఫిబ్రవరి 02, 2019 నుండి కొనసాగుతున్నారు. పంచాయతీ కార్యదర్శిగా గౌని మహేశ్ విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం మల్టీపర్పస్ కింద నలమాస వీరన్న, పైండ్ల యాలాద్రి, పులి సాంబయ్యలను తీసుకుంది. పంచాయతీ పాలకవర్గం అధనంగా మాచర్ల మల్లయ్య, ఇరుగు ఉప్పలయ్యలను కొనసాగిస్తుంది.


కొమ్ము సత్యం


సత్యనారాయణరెడ్డి


పి. వీరయ్య


డి.వెంకట్‌రెడ్డి


కె.రాంచందర్


బానోత్ వాలీ


పంజాల పద్మ


జి.రాంచంద్రయ్య


పి.యాకసాయిలు

## Temples
## దేవాలయాలు



గ్రామానికి పడమర వైపు ఉన్న జక్కి చిన్న



నారాయణ ఇంటి సమీపంలో పూర్వం బొడ్రాయి ఉండేది. అయితే ప్రజలు 2016లో గ్రామనడిబొడ్డున బొడ్రాయిని పునఃప్రతిష్ఠ చేశారు. తూర్పువైపు పాత చెరువు వెళ్లే డొంకదారిలో గడిమైసమ్మ తల్లిగుడి ఉండేదని గ్రామస్తులు తెలిపారు. ఊరగుట్ట సమీపంలోని ఉన్న బోడ్కు ముక్కుడు ముత్యాలమ్మతల్లి పూర్వం నుండి కొలువుతీరి ఉంది. పంట పొలాలు ఉన్న రైతులు ఎక్కువగా కొలుస్తుంటారు. బీసీ కాలనీలో ఉన్న ముత్యాలమ్మతల్లి గుడి నిర్మాణం 2002లో మాజీ సర్పంచి దేవరం వెంకట్‌రెడ్డి మరియు దాతల సహకారంతో నిర్మాణం చేయించారు. పాత గ్రామపంచాయతీ సమీపంలో ఉన్న ముత్యాలమ్మ తల్లిని మాల కులస్తులు కొలుస్తుంటారు.


హన్మంతుని గుడి


ముత్యాలమ్మతల్లి గుడి


కట్టమైసమ్మతల్లి


ముక్కుడుముత్యాలమ్మతల్లి


తిరుపతమ్మతల్లిదేవాలయం


గడిమైసమ్మతల్లి


శ్రీఅంజేయస్వామి వెలసిన అద్దగుట్ట


మాట ఇవ్వడానికి తొందరపడకు, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి తొందరపడు


ముత్యాలమ్మ తల్లి గుడి

2017లో మాల కులసంఘం ఆధ్వర్యంలో దాతలతో గుడి నిర్మాణం చేశారు. 2001లో సర్పంచి కొండపల్లి రాం చంద్రావు హయాంలో హనుమంతుని గుడి నిర్మాణం చేయించారు. గ్రామానికి తూర్పువైపున మహబూబాబాద్ వెళ్లే రహదారిలో తిరుపతమ్మతల్లి కొలువు తీరింది. మహిమగల తిరుపతమ్మతల్లికి భక్తులు నిత్యం పూజలు నిర్వహిస్తున్నారు. దాతలు ముందుకు రావడంతో అక్టోబర్ 17,2020 రోజున దేవాలయం నిర్మాణం కోసం పనులు ప్రారంభించారు. సర్పంచి పంజాల యాకసాయిలు ఆధ్వర్యంలో పనులు కొనసాగుతున్నాయి. ముదిరాజు కులస్తులు పూజించే కులదేవత పెద్దమ్మతల్లి దేవాలయాన్ని పాతచెరువు కట్ట సమీపంలో ఫిబ్రవరి 15,2015 రోజున ప్రతిష్ట చేసి, గుడి నిర్మించారు. ఈ గుడి నిర్మాణానికి కాంగ్రెస్ లీడర్ దేవరం ప్రకాశ్‌రెడ్డి సహకరించారు. గౌడ కులస్తులు చెరువు సమీపంలోని తాళ్లల్లో కాటమయ్య దేవున్ని ఫిబ్రవరి 4, 1982లో ఏర్పాటు చేసుకుని పూజలు నిర్వహించేవారు. అయితే నివాస స్థలాల కోసం ప్రభుత్వం కొను గోలు చేసిన భూమిలో కాట మయ్య దేవున్ని ఫిబ్రవరి 2, 2016 రోజున పునఃప్రతిష్ఠ చేశారు. ఎస్సీలు పూజించే సవారి లక్ష్మీ దేవత దేవాలయాన్ని మార్చి 24, 2019 రోజున పునః ప్రతిష్టాపనచేసి గుడిని నిర్మించిన దాతగా గ్రామ సర్పంచి పంజాల యాకసాయిలు నిలిచారు. జూలై 26, 2017 రోజున పాతచెరువు కట్టపై మదేళ్లయ్య దేవుని గుడిని రజక కుల సంఘం ఆధ్వర్యంలో నిర్మించారు. గ్రామానికి చెందిన వేముల లలిత పుట్టింది హిందూమతంలో అయినా ఇంట్లోనే దర్గాను ఏ ర్పాటు చేసుకుని అల్లాను ప్రార్థిస్తుంది. ఈ దర్గాకు ఇతర ప్రాంతాల నుండి భక్తులువచ్చి మొక్కులు చెల్లించుకుంటారు.


ముత్యాలమ్మ తల్లి గుడి


కాటమయ్య దేవాలయం


సవారి లక్ష్మీ దేవాలయం


మదేళ్లయ్య గుడి


పెద్దమ్మ తల్లి దేవాలయం

## అపరిష్కృత ప్రధాన సమస్యలు

అపరిష్కృతంగా ఉన్న ప్రధాన సమస్య డ్రైనేజీ వ్యవస్థ. మురుగు కాల్వల పరిస్థితి అధ్వానంగా ఉంది. అంతర్గత రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2017లో రూ.16 లక్షలతో గ్రామ పంచాయతీని అన్ని హంగులతో నిర్మించేందుకు


నిధులు లేక అసంపూర్తిగా ఉన్న పంచాయతీ భవనం


అంతర్గత రహదారుల పరిస్థితి ఇది


సైడ్ కాల్వల దుస్థితి



ఆహంకారం, గర్వం మనిషి పతనానికి దారి తీస్తాయి


నిరుపయోగంగా ఉన్న మిషన్

నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ఈ భవన నిర్మాణానికి నిధులు సరిపోక అసంపూర్తిగా ఉంది. ఫిబ్రవరి13,1991లో నిర్మించిన పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరింది. గ్రామం నుండి పాత చెరువుకు వెళ్లే రహదారి లేక వ్యవసాయదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా బతుకమ్మ పండుగ, ముదిరాజుల పెద్దమ్మతల్లి పండుగ, మడేళ్లయ్యదేవుని పండుగల సమయాల్లో మహిళలు, పిల్లలు, వృద్ధులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో నిరుపేదల కోసం ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికై రూ.260లక్షల నిధులు కేటాయించింది. 2018, మే20న సర్పంచి గోల్కొండ రాంచంద్రయ్య హయాంలో ఎమ్మెల్యే శంకర్‌నాయక్ శంకుస్థాపన చేసారు. అయినా నేటికి ఆ పనులు ప్రారంభం కాలేదు. మిషన్‌భగీరథ పథకంలో ఇంటింటికి వేసిన నల్లాలు నిరుపయోగంగా ఉన్నాయి.

## పండుగలు, సాంస్కృతిక కార్యకలాపాలు



గ్రామంలో1994 వరకు పది రోజుల పాటు వైభవంగా పీర్ల పండుగను కులమతాలకు అతీతంగా జరిపారు. అప్పట్లో బందెల్లి అనే ముజివారు... ఉండేది. ఆయన ఆధ్వర్యంలో ఘనంగా పీర్ల పండుగను జరిపేవారు. మొహర్రం నెల మొదటి రోజు నుండి పదవరోజు వరకు భక్తి శ్రద్ధలతో పండగను గ్రామస్తులందరు జరుపుకునేవారు. పీర్ల రూపాలను తయారు చేసి వాటిని అలంకరించి మట్కీలకు పూజించి గ్రామాల్లో, తండాలల్లో పీర్లను ఊరేగించేవారు. రాత్రి వేళలో గుండం తీసి పీర్లతో నృత్యాలు, విచిత్ర



వేషాదారణలతో అందర్ని ఆకట్టుకునే వారు. 1995లో బందెల్లి అనారోగ్యంతో ఉన్న క్రమంలో ఇక్కడ ముజివారు లేక సావర్లను వీఎస్‌లక్ష్మీపురం గ్రామానికి ఇవ్వడం వల్ల మన గ్రామంలో పీర్ల పండుగలు నిలిచిపోయాయి. గ్రామంలో బల్లారి చంద్రయ్య ఒగ్గుకథ చెప్పేవారు. ఆయనతో పాటు పరాల లింగయ్య ఇతర ప్రాంతాల నుండి కొంతమంది కళాకారులను తీసుకవచ్చి గ్రామంలో, ఇతర ప్రాంతాలలో ఒగ్గుకథ చెప్పెవారు. శ్యామకూరి నర్సయ్య (డ్రామ) నాటికలు వేయడంతో కళాకారుడిగా మంచి గుర్తింపు వచ్చింది. 1987 నుండి కొంతకాలం





గ్రామానికి చెందిన కొందరు కళాకారులు గ్రామంలో బాగోతాలు వేసేవారు. పెరుమాండ్ల మల్లయ్య, గోల్కొండ పెద్ద వెంకన్న, గోల్కొండ యాకయ్య గోల్కొండ చిన్న వెంకన్న, గుండెల ఉప్పలయ్య, పొదిల రాములు, మాచర్ల రాములు, గంగదారి పుల్లయ్య, పంజాల వెంకటనారాయణ, బోయిని రంగయ్య, పంజాల నర్సయ్య, మాచర్ల చిన్న రాములుతో పాటు మరి కొందరు భద్రకాళీ, బాలనాగమ్మ, కాంచనమాల తదితర బాగోతాలు వేసేవారు. 1960లో



పంజాల నారాయణ (పంతులు), జెట్టి ఎల్లయ్య, బుడిగ బోయిన జగ్గయ్య, బోళ్ల పర్వతాలు ఆధ్వర్యంలో ఘనంగా దసరా వేడుకలు నిర్వహించేవారు 1990లో గ్రామంలో చిందుయక్షగాన కళాకారులు ముఖ్యంగా రామాయణం, మహాభారతం, లవకుశ, సత్యహరిశ్చంద్ర, సిరితొండ, భక్తప్రహ్లాద, అల్లిరాణి చరిత్ర, బాలనాగమ్మ, సతీసావిత్రి, భీష్మ విజయంలతో పాటు మరెన్నో బాగోతాలు గడ్డం తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించేవారు. ఈ బృందంలో రవి, యాకయ్య, చిన్న యాకయ్య, నరహరి, దనుంజయ, శ్రీనివాస్, కృష్ణ, సమ్మయ్యలు ఆటపాటలతో అందర్ని అలరించేవారు. 1994 నుండి 1998 వరకు గ్రామంలో ఆదర్శ యూత్ అసోసియేషన్ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు , వేడుకలు ఘనంగా నిర్వహించేవారు. 2008లో





బానిసకు బాధలెక్కువ–స్వతంత్రుడికి బాధ్యతలెక్కువ: గాంధీ



ప్రగతియూత్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. 1995లో పంజాల లింగమూర్తి (టీచర్) ఆధ్వర్యంలో దసరా వేడుకలు ఏర్పాటు చేశారు. 2017 నుండి గ్రామస్తులతో కలిసి ముదిరాజులు గుండెల ఉప్పలయ్య దసరా వేడుకలు నిర్వహిస్తున్నారు. గ్రామంలో ప్రతియేటా శ్రీరామనవమి సందర్భంగా గ్రామంలో సీతారాముల వారి వివాహ మహోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నారు. ముదిరాజు కులస్తులు ప్రతి యేటా పెద్దమ్మతల్లి బోనాల పండుగను నిర్వహిస్తున్నారు. గౌడ కులస్తులు కాటమయ్య దేవుని పండుగను ఐదేళ్లకు ఒక్కసారి జరుపు కుంటారు. రజకులు మడేళ్లయ్య దేవుడికి ప్రతి యేటా వనభోజనాలు, ఐదేళ్లకో సారి బోనాలు పండుగను జరుపుకుంటారు. ఎస్సీలు సవారి లక్ష్మీదేవత పండుగలు ప్రతి ఐదేళ్లకు ఒక్కసారి జరుపుకుంటారు. 2002లో గ్రామంలోని తొలి సారిగా ఎస్సీ కాలనీలో పులి సోమయ్య, పులి వెంకన్న (చంటి), ఇరుగు రమేశ్, పులి యాకయ్య, పులి సతీశ్, ఇరుగు సైదులు, పులి బాబుల ఆధ్వర్యంలో వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి వేడుకలు జరిపారు. 2017, 2018, 2019 మూడేళ్లు పాటు దుర్గామాత నవరాత్రుల వేడుకలు కొయ్యల అనిల్, పంజాల నరేశ్, పంజాల సందీప్, దారం సందీప్, కూన వేణు, పైండ్ల వీరన్నల ఆధ్వర్యంలో నిర్వహించారు. మహా అన్నదానం కార్యక్రమం కూడా ఏర్పాటు చేశారు.









## స్వచ్ఛంధ సంస్థలు వాటి



1994లో గ్రామంలోని ఆదర్శ యూత్ అసోసియేషన్ స్వచ్ఛంధ సేవా సంస్థ ఏర్పాటైంది. 1998 వరకు గ్రామంలో అనేక స్వచ్ఛంధ, సాంస్కృతిక శ్రమదానం కార్యక్రమాలు, పలు ఉత్సవాలు నిర్వహించారు. వ్యవస్థాపక అధ్యక్షుడిగా గుండెల రాజు పని చేశారు. ఆయనతో పాటు రణబోత్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లెల సాయిలు, బైరోజు బ్రహ్మచారి, గుడిసె రమేశ్, జక్క వెంకట్రామనర్సయ్య, బుడిగబోయిన వెంకట్రామనర్సయ్య, పొదిల మల్లయ్య, పరాల మల్లయ్య, కొండెబోయిన గుట్టయ్య, పైండ్ల వీరన్న, కొయ్యల వెంకన్న, గోల్కొండ శ్రీనివాస్, రత్న పురపు రవి, ఉప్పుల మల్లయ్య, కన్నెబోయిన ఐలయ్య, గంగదారి నారాయణలతో పాటు మరికొంత మంది యువకులు పని చేశారు. కాగా ఇతర ప్రాంతాలకు వెళ్లి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని అనేక బహుమతులు గెలిపొందారు. అంతేగాక ఉమ్మడి వరంగల్ జిల్లా ఉత్తమ ఆదర్శ యూత్‌గా 1998లో అవార్డు దక్కింది. 2008లో ప్రగతి యూత్ ఏర్పాటు చేశారు. స్వచ్ఛంధంగా సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అధ్యక్షుడిగా చామకూరి సాగర్ కోనసాగాడు. సంఘంలో గోల్కొం డ శ్రావణ్, పెరుమాండ్ల ప్రతాప్, పంజాల చిన్న సురేశ్, పవన్, గుర్రాల విద్యాసాగర్, కొమ్మరాజుల సంజీవ, భరత్,



వినోద్‌లతో పాటు యువకులు పని చేశారు. తెలంగాణ జానపద నృత్య కళాకారుల సమాఖ్య సంఘం బృందంలో కొమ్మరాజుల వెంకన్న, జిల్లెల సాయిలు, గుండెల శ్యాం, కిరణ్, దొంతు యాకన్న, భూముల శ్రీనులు పని చేస్తున్నారు. పోతురాజు విన్యాసాలు, చిర్రకోలాటం, నృత్యాలు వివిధ ప్రాంతాలకు వెళ్లి ప్రదర్శనలు ఇస్తున్నారు.



అన్యాయమే చట్టమైనప్పుడు ఎదురించడమే నీ బాధ్యత కావాలి: చే గువేరా

## గ్రామీణ బ్యాంకు, రుణ సౌకర్యాలు


మీ సేవ కేంద్రం

గ్రామంలోని పోస్టాఫీసు 1962, ఫిబ్రవరిలో ఏర్పాటు కాగా 1972లో 506 104 పిన్‌కోడ్ ఏర్పడింది. జంగిలిగొండ, వీఎస్‌లక్ష్మీపురం ఉమ్మడి పంచాయతీలకు ఒక్కటే పోస్టాఫీసు ఉంది. ప్రస్తుతం ఉమ్మడి గ్రామంలో సుమారు 60ఆర్‌డీ ఖాతాలతో కొనసాగుతుంది. గ్రామంలో పోస్టాఫీసు ద్వారా మొత్తం242 మందికి ఆసరా పింఛన్లు అందజేస్తున్నారు. అందులో 109 మంది వృద్ధులు, 66 మంది వితంతువులు, 35 మంది వికలాంగులు, 32 మంది గీతకార్మికులు, ఇద్దరు వంటరి మహిళలు ఉన్నారు. పర్వతగిరి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఛైర్మన్‌గా 1995 నుండి 1997 వరకు గ్రామానికి చెందిన కొండపల్లి రాంచందర్‌రావు (టీడీపీ) కొనసాగారు. ఆ తరువాత 2001లో బైరోజు వెంకటాచారి (కాంగ్రెస్) డైరెక్టర్‌గా ఎన్నికై వైస్‌ఛైర్మన్‌గా పని చేశారు. కొత్తగా ఏర్పడిన మహబూబాబాద్ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి డైరెక్టర్‌గా బైరోజు బ్రహ్మచారి (కాంగ్రెస్) జనవరి 2013 నుండి ఆగస్టు, 2018 వరకు పని చేశాడు. ఫిబ్రవరి 2020లో నలమాస విజయ (టీఆర్ఎస్) డైరెక్టర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై కొనసాగుతుంది. 1995లో ఆదర్శ యూత్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గుండెల రాజు ఆధ్వర్యంలో 45 మందితో తొలిసారిగా గ్రామంలో మూడు మహిళా డ్వాక్రా సంఘాల ఏర్పాటుకు కృషి చేసినారు. భాగ్యలక్ష్మీ, ధనలక్ష్మీ, సంధ్య గ్రూపులు ఏర్పడ్డాయి. దీనిని స్ఫూర్తిగా తీసుకుని ఆ తర్వాత గ్రామంలో మరి కొన్ని సంఘాలు ఏర్పాడ్డాయి. అఖిల గ్రామైక్య తొలి సంఘం అధ్యక్షురాలుగా గుండెల మల్లమ్మ కొనసాగింది. తర్వాత సత్తెమ్మ, జాహెద, ఉత్తరమ్మలు అధ్యక్షురాలుగా కొనసాగారు. ప్రస్తుతం హైమావతి కొనసాగుతుంది. 340 మందితో 31 మహిళా సంఘాలు ఉన్నాయి. పీఏసీఎస్ డైరెక్టర్ బైరోజు బ్రహ్మాచారి ఆధ్వర్యంలో ధాన్యం కోనుగోలు కేంద్రం 2018 నుండి మూడు సార్లు ఏర్పాటు చేశారు. తర్వాత ఒక్కసారి పంజాల రాంమూర్తి, మూడు




సార్లు నలమాస విజయ కొనసాగిస్తున్నారు. ఎస్‌బీఐ సర్వీస్ పాయింట్ 2002లో కొండ్లె రమేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. జంగిలిగొండ, వీఎస్‌లక్ష్మీపురం, సింగారం గ్రామాలకు 2వేలకు పైగా ఖాతాలు ఉన్నాయి. ప్రస్తుతం జంగిలిగొండకు ప్రత్యేకంగా సర్వీస్ పాయింట్ ఏర్పడింది. సుమారు 1,500 పైగా ఖాతాలు ఉన్నాయి. ప్రస్తుతం వీటిని కొయ్యల మాధవి నిర్వహిస్తుంది. గ్రామంలో మీసేవ 2018లో ప్రారంభమైంది. పులి యాకయ్య నిర్వాహకులుగా పని చేస్తున్నారు.

## ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలు


కేవులతండా వెళ్లే రోడ్

గ్రామం నుండి మండల, జిల్లా కేంద్రానికి, అక్కడి నుండి రాష్ట్ర రాజధానులకు వెళ్లేందుకు అనువైన తారురోడ్డు, ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు సౌత్‌సెంట్రల్ రైల్వేస్టేషన్ సౌకర్యం ఉంది. 1995లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం హయాంలో దేవరం ప్రకాశ్‌రెడ్డి కృషితో జంగిలిగొండ నుండి మూలగుట్ట, నర్సింహులగూడెం వరకు రూ.5.25లక్ష లతో పార్మేషన్ రోడ్డు నిర్మించారు. 2002లో జంగిలిగొండ నుండి గుండాలగడ్డ తండాకు రూ.12 లక్షలతో, 2013లో జంగిలిగొండ నుండి కేవులతండా రూ.25లక్ష లతో ఫార్మేషన్, మెటల్‌రోడ్, 2012లో దూదియాతండా నుండి రోటిబండతండాకు రూ.60లక్షలతో, 1996లో పీడబ్ల్యూడీ రోడ్ నుండి కేవులతండాకు తారు రోడ్ నిర్మించేందుకు దేవరం ప్రకాశ్‌రెడ్డి కృషి చేశారు. గతంలో అమనగల్లు సబ్‌స్టేషన్ నుండి జంగిలిగొండకు కరెంట్ సరఫరా చేసేవారు. 2013లో 33/11కేవీ సబ్‌స్టేషన్ నిర్మించేందుకు రూ.40లక్షల నిధులతో దేవరం ప్రకాశ్‌రెడ్డి మంజూరి కోసం కృషి చేశారు. 2015లో 210 సర్వేనెంబర్ గల ప్రభుత్వ భూమిలో 1.20 ఎకరాల స్థలంలో నిర్మాణం పనులు సర్వంచి యాకసాయిలు చేయించారు. 2020 సంవత్సరంలో 210 సర్వేనెంబర్ ప్రభుత్వ భూమి గల 20గుంటలలో రూ.5.03 లక్షల నిధులతో పల్లెప్రగతి వనం ఏర్పాటు చేశారు. 2020లో 210 సర్వే నెంబర్ ప్రభుత్వ భూమిలో


అమనగల్లు వెళ్లే రోడ్


రైతు వేదిక


లోకంలో మంచిపని దీపంలా ప్రకాశిస్తుంది : షేక్స్పియర్



వైకుంఠదామం

10గుంటలలో రూ.7.55 లక్షలతో నర్సరీ, 10గుంటలలో పంచాయతీ భవనం ఏర్పాటు చేశారు. 2020లో 198 సర్వేనెంబర్ ప్రభుత్వ భూమిలో 30గుంటలలో రూ.2.30లక్షలతో డంపింగ్ యార్డు, 2020లో సర్వేనెంబర్ 198 ప్రభుత్వ భూమిలో 30 గుంటలలో రూ.12.60 లక్షలతో వైకుంఠదామం నిర్మించారు. 2020లో 217 సర్వేనెంబర్ ప్రభుత్వ భూమిలో 10గుంటలలో రూ.22లక్షలతో రైతువేదిక నిర్మాణం సర్పంచి పంజాల యాకసాయిలు హయాంలో జరిగింది. గ్రామంలో 13 సోలార్ లైటింగ్‌లు, రెండు సెంటర్ లైటింగ్‌లు సర్పంచి యాకసాయిలు ఏర్పాటు చేయించారు. పంచాయతీ నిధుల ద్వారా ట్రాక్టర్, ట్యాంకర్ కొనుగోలు చేశారు. 1994లో గ్రామానికి తొలిసారిగా టెలీఫోన్ సౌకర్యం వచ్చింది.

## ఆర్థిక వనరులు

గ్రామంలో ప్రజలకు ఎక్కువగా వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. అంతేగాక వ్యవసాయ కూలీలుగా పనులకు వెళ్తుంటారు. కొన్ని కుటుంబాలు ఇక్కడ పనుల్లేక ఇతర ప్రాంతాలకు వలస వెళ్తుంటారు. ఇతర కుటీర పరిశ్రమలు చేతి వృత్తులపై గ్రామస్థులు పెద్దగా ఆధారపడి లేరు. పంచాయతీకి పన్నుల ద్వారా ఏడాదికి రూ.81,255ఆదాయం వస్తోంది. గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2005 నుండి అమల్లో ఉంది. ఈ పథకంలో మొత్తం 914 జాబ్‌కార్డులు ఉన్నాయి. అందులో 1,219మంది కూలీలు ఉపాధి పనులు పొందుతున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌గా కొమరారాజుల ఉమారాణి కొనసాగారు. మార్చి 16, 2020 నుండి ప్రభుత్వం వారిని తొలగించడం వల్ల పంచాయతీ కార్యదర్శి కూలీలకు ఉపాధి పనులు కల్పిస్తున్నారు. శ్రీరామ పేపర్ ప్లేట్ల తయారీ పరిశ్రమను పులి సోమయ్య ఏర్పాటు చేశారు. 2020లో మోడ్రన్ రైస్ మిల్లును ప్రైవేట్ వ్యక్తులు ఏర్పాటు చేశారు. గ్రామంలో కిరాణం షాపులు, చికెన్ షాపులు, టెంట్‌హౌజ్, మెకానిక్‌షెడ్, ఎలక్ట్రికల్ షాపు, ఎరువుల షాపు, బిర్యానీ పాయింట్, ఫాస్ట్ ఫూడ్ సెంటర్, కంగన్‌హాల్,



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

బట్టల షాపులు, సెలూన్, వెల్డింగ్ షాపులు అందుబాటులో ఉన్నాయి. అంతేగాక ఆటోలు, ట్రాక్టర్లు, జేసీబీలు కూడా ఉన్నాయి.

## ప్రజారోగ్యం





ఆరోగ్య ఉప కేంద్రం

గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయి. మే20,2018లో రూ.8లక్షల నిధులతో ఉపకేంద్రం నిర్మాణం కోసం కాంగ్రెస్ లీడర్ దేవరం ప్రకాశ్‌రెడ్డి కృషి చేశారు. ఎఎన్ఎం మాత్రం స్థానికంగా ఉండటం లేదు. గ్రామంలోని ముగ్గురు ఆశాకార్యకర్తలు యాకమ్మ, అనిత, స్వరూపలు మాత్రమే అందుబాటులో ఉంటున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 9.1 కిలో మీటర్ల దూరం మల్యాల గ్రామంలో ఉంది. జిల్లా ఆసుపత్రి 15.5కిలో మీటర్ల దూరంలో ఉంది. గ్రామంలో అనుముల జలేంద్రాచారి 1975 నుండి 1995వరకు ఆర్ఎంపీగా పని చేశారు. పంజాల లింగమూర్తి 1996లో ఏడాది పాటు ఆర్ఎంపీగా పని చేశారు. లెక్కల శ్రీనివాస్‌రెడ్డి 1990 నుండి 2004 వరకు, కొమరారాజుల వెంకన్న 2002 నుండి 2004 వరకు పని చేశారు. ప్రస్తుతం గ్రామంలో అనుముల రమేశ్ 1985 నుండి, లెక్కల చంద్రారెడ్డి 2009 నుండి ఆర్ఎంపీలుగా పని చేస్తున్నారు. జంగిలిగొండ గ్రామానికి చెందిన దేవరం పురుషోత్తంరెడ్డి సహకారంతో శ్రీకరుణ మెడికల్, జనరల్ స్టోర్స్ ఆధ్వర్యంలో గ్రామంలో పలు సార్లు ఉచిత మెడికల్ క్యాంప్ ల ద్వారా వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పురుషోత్తంరెడ్డి కొనసాగుతు న్నారు.



**కరోనాలో :** మార్చి 22, 2020 దేశవ్యాప్తంగా నిరవధిక లాక్‌డౌన్ కష్టకాలంలో గ్రామ ప్రజలు కరోనా మహమ్మారిని ధైర్యంగా ఎదుర్కొన్నారు. అయితే జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు సైతం స్వగ్రామానికి వచ్చారు. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ.. ఒకరికొక్కరు సహకరించుకుంటూ.. కులమతబేధం లేకుండా ఆత్మవిశ్వాసంతో కరోనాను జయించారు. అంతేగాక వ్యాక్సినేషన్‌లో కూడా ముందు వరసలో ఉండి జిల్లాకు ఆదర్శంగా నిలిచింది.

## కుల సంఘాలు. ప్రతినిధులు

ఎస్సీలల్లో హరిజన కులసంఘ పెద్దమనుషులుగా ఇరుగు ముత్తయ్య, ఇరుగు కొమురయ్య, మాల కులసంఘ పెద్దమనుషులుగా గుర్రాల యాకయ్య, కాశిమల్ల శ్రీహరి, చిందు కులసంఘ పెద్దమనుషులుగా గడ్డం రాఘవులు, గడ్డం శ్రీనివాస్ , బీసీలల్లో మున్నూరుకాపు కులసంఘ అధ్యక్షులుగా పూజల శ్రీనివాస్, కార్యదర్శిగా జక్క శంతన్, ముదిరాజు కులసంఘ పెద్దమనుషులుగా గుండెల ఉప్పలయ్య, బుడిగబోయిన గుట్టయ్య, గౌడ కులసంఘ పెద్దమనుషులుగా పంజాల వెంకటనారాయణ, గోల్కొండ నారాయణ, విశ్వబ్రాహ్మణ కులసంఘ పెద్దమనుషులుగా బైరోజు బ్రహ్మచారి, పోతుగంటి శ్రీనివాసాచారి, వడ్డెర కులసంఘ పెద్దమనుషులుగా కొమ్మరాజుల సోమయ్య, గుంజె వెంకన్న, రజక కులసంఘ పెద్దమనుషులుగా పొదిల యాదగిరి, రత్నపురపు రవి, కుమ్మరి కులసంఘ పెద్దమనుషులుగా మొద్దుపురం సాయిలు, గంగదారి పుల్లయ్య, యాదవ కుల సంఘం అధ్యక్షుడిగా ఉప్పుల సౌనయ్య, కార్యదర్శిగా పరాల మల్లయ్య, మేర కులసంఘ పెద్దమనుషులుగా వెన్నం పుల్లయ్య, వెన్నం వెంకన్న, ఓసీల్లో వైశ్య కులసంఘ పెద్దమనుషులుగా కొండ్లె వెంకట్రామనర్సయ్య, దారం లక్ష్మినారాయణ, రెడ్డి కులసంఘ పెద్దమనుషులుగా దేవరం వెంకట్‌రెడ్డి, రణబోత్ నర్సింహారెడ్డి, ముస్లిం కులసంఘ పెద్దమనుషి జానీ, కమ్మ కులసంఘ పెద్దమనుషిగా కొండపల్లి రాంచందర్‌రావు కొనసాగుతున్నారు. గ్రామంలో మొత్తం 16 కులాలకు చెందిన కుటుంబాలున్నాయి.

## సొసైటీ సంఘాలు

గ్రామంలోని ముదిరాజు, గౌడ కులసంఘాల సొసైటీలు ఏర్పాడ్డాయి. రజక, వడ్డెర సంఘాల సొసైటీలు ప్రతిపాధనలో ఉన్నాయి. ముదిరాజ్ కులసంఘం సభ్యులతో సెప్టెంబర్30,1993న సొసైటీ ఏర్పడింది. పాతచెరువు పరిధిలోని మత్స్యపారిశ్రామిక సహకార సంఘం లిమిటెడ్ జంగిలిగొండ, రి.నెం. ఎం303 సొసైటీ రిజిస్ట్రేషన్ అయింది. మొత్తం 49 మంది ముదిరాజు సభ్యులతో ఏర్పాటైన సొసైటీకి వ్యవస్థాపక అధ్యక్షుడిగా బోయిన రంగయ్య కొనసాగారు. భూం చిన్న వెంకన్న అధ్యక్షుడిగా రెండు సార్లు, గుడిసె వెంకటయ్య, బోయిన మల్లేశం అధ్యక్షులుగా కొనసాగారు. భూం చిన్న వెంకన్న అధ్యక్షుడిగా ఉన్న హయాంలో సంఘానికి స్థలం కొనుగోలు చేశారు. 2001లో కార్యదర్శిగా పని చేసిన గుండెల రాజు ముదిరాజు సంఘం భవనం నిర్మాణానికి కృషి చేసి దాతగా నిలిచారు.


ముదిరాజ్ సంఘం భవనం

ప్రస్తుతం సొసైటీ అధ్యక్షుడిగా గుండెల యాదగిరి, ఉపాధ్యక్షులుగా బుడిగబోయిన వెంకట్రామనర్సు, కార్యదర్శిగా జెట్టి యాకన్న, డైరెక్టర్లగా బరిగెల సతీశ్, బోయిని వెంకటేశ్వర్లు, బోయిని భద్రయ్య, కొండెబోయిన గుట్టయ్య, జెట్టి వీరన్న, గుడిసె ముత్తయ్యలు కొనసాగుతున్నారు. గీత పారిశ్రామిక సహకార సంఘం ఎల్.నెం139తో జంగిలిగొండ కొత్తగా 22మంది గౌడ కులస్తులతో డిసెంబర్ 20, 2021న ఏర్పడింది. వ్యవస్థాపక అధ్యక్షుడిగా కొయ్యల జగన్నాథం, ఉపాధ్యక్షుడిగా పెరుమాండ్ల మల్లేశం, కార్యదర్శిగా జలగాం యాకసాయిలు, కోశాధికారిగా వేముల సుధాకర్, డైరెక్టర్లుగా కొయ్యల శ్రీను, పెరుమాండ్ల మల్లయ్య, గొల్కొండ భద్రయ్య, తాళ్ల శ్రీను, గిరిగాని రవీందర్, వేముల యుగేందర్, పెరుమాండ్ల వెంకన్న, మండల సోసైటీ కమిటీ కార్యదర్శిగా బొమ్మర శ్రీకాంత్ కొనసాగుతున్నారు.

## ప్రజాపంపిణీవ్యవస్థ

గ్రామంలోని రేషన్ షాపులు ప్రస్తుతం జంగిలిగొండ, కేవులతండా, రోటిబండతండా ఉమ్మడి గ్రామ పంచాయతీలో కొనసాగుతున్నాయి. గ్రామంలో మొత్తం874 రేషన్‌కార్డులు ఉండగా అందులో 2,607యూనిట్లు ఉన్నాయి. 450రేషన్‌కార్డులు, 1,355యూనిట్లు పెరుమాండ్ల లింగమూర్తి, 424 రేషన్ కార్డులు 1,252 యూనిట్లకు పులి సోమయ్య పరిధిలో ఉన్నాయి. వీరిద్దరు రేషన్ డీలర్లుగా కొనసాగుతున్నారు. గ్రామంలో తొలి రేషన్ డీలర్‌గా పులి ముత్తిలింగయ్య పని చేశాడు.

## మండల ప్రాదేశిక సభ్యులు

సమితిల (బ్లాక్‌లు) నుండి మండలాలు 1985లో ఏర్పడ్డాయి. వీఎస్ లక్ష్మీపురం, సింగారం, జంగిలిగొండ ఉమ్మడి గ్రామాలకు మండల ప్రాదేశిక నియోజకవర్గం (ఎంపీటీసీ) ఎన్నికలు నిర్వహించారు. 1995లో తొలిసారిగా ఎంపీటీసీ ఎన్నికలు జరిగాయి. వీఎస్‌లక్ష్మీపురం గ్రామానికి చెందిన దేవులనాయక్ (కాంగ్రెస్) ఎంపీటీసీ సభ్యుడిగా 1995 నుండి 2001 వరకు కొనసాగారు. 2001 నుండి 2007 వరకు జంగిలిగొండకు చెందిన బోయిని ఉత్తరమ్మ (కాంగ్రెస్) కొనసాగారు. 2007లో జంగిలిగొండ ప్రత్యేకంగా ఎంపీటీసీ



సంకల్పం మంచిదైతే శక్తివెతుకుంటూ వస్తుంది : ఎమర్సన్

ఏర్పడింది. తొలిసారిగా కొమ్మురాజుల ఎల్లమ్మ (టీడీపీ) ఎన్నిక కాగా 2007 నుండి 2014 వరకు, బానోత్ బాలకృష్ణ (కాంగ్రెస్) 2014 నుండి 2019 వరకు కొనసాగారు, 2019 నుండి కొండపల్లి రాంచంద్రమ్మ (టీడీపీ) ఎంపీటీసీ సభ్యురాలుగా కొనసాగుతున్నారు.


దేవులనాయక్


బోయిని ఉత్తరమ్మ


కె. ఎల్లమ్మ


బానోత్ బాలకృష్ణ


కె.రామచంద్రమ్మ

## విద్యా-ఉద్యోగ ఇతర రంగంలో..

గ్రామానికి చెందిన కొందరు ప్రభుత్వ, ప్రైవేట్ రంగంతో పాటు విదేశాల్లో ఇతర ప్రాంతంలో విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగంలో రాణిస్తున్నారు. పంజాల నారాయణ గ్రామంలో తొలి ప్రభుత్వ ఉద్యోగి. ఆయన ఆగష్టు 11, 1962లో ఉద్యోగం పొంది ఉపాధ్యాయుడిగా పని చేశారు. గ్రామంలో ఆయన తొలి పంతులు కావడంతో 'పంతులు' నారాయణగా పేరొచ్చింది. ఆయనతో పాటు గ్రామానికి చెందిన పోతుగంటి బ్రహ్మం, కాశిమల్ల బిక్షం, పంజాల సత్యనారాయణలు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పని చేసి రిటైర్మెంట్ అయ్యారు. మహిళా ఉద్యోగులు దేవరం కరుణ, పంజాల అరుణకుమారి, గుర్రాల సునిత ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. పంజాల శ్రీనివాస్, పంజాల లింగమూర్తి, గుర్రాల వెంకన్న, అనుముల వెంకటేశ్వర్లు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. జక్క భాస్కర్ (రైల్వేఉద్యోగి), నలమాస ప్రభాకర్ (హెడ్‌కానిస్టేబుల్), శివరాత్రి ప్రవీణ్‌కుమార్ (ఎఆర్ కానిస్టేబుల్), అనుముల శ్రీధర్ (పోస్టల్ డిపార్టమెంట్), దార నరేశ్ నీటిపారుదల శాఖలో ఏఈగా పని చేస్తున్నారు. కొమ్మురాజుల యాకయ్య (తహసీల్దార్ ఆఫీసులో అటెండర్), గోల్కొండ శ్రీకాంత్ (పంచాయతీ కార్యదర్శి), బచ్చలి నాగయ్య (కలెక్టరేట్‌లోని అటెండర్), వెన్ను ప్రవీణ్ కుమార్ (ఆర్మీ), పప్పుల వినోద్ (బీపీఎల్-ఉద్యోగి), ఎండీ యూసుబ్ (ఆర్టీసీ-డ్రైవర్), పంజాల కార్తీక్ మెడిసిన్‌లో ఎంఎస్ ఆర్థోపెడిక్ పూర్తి చేశారు. గ్రామంలో ఆయన తొలి వైద్యుడు. ఆయన భార్య శ్రీవిద్య వైద్యురాలు. కొండపల్లి స్వాతి హైదరాబాద్ లో రెడియో వ్యాఖ్యాత, పెరుమాండ్ల నవీన్ హైదరాబాద్‌లోని మెట్రో స్టేషన్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. గోల్కొండ అన్వేశ్ (ఎయిర్‌పోర్టులో పని చేస్తున్నారు), అంతేగాక సాఫ్ట్‌వేర్ రంగంలో పంజాల సందీప్, పంజాల హారిక, దేవరం ప్రశాంత్ రెడ్డి, దేవరం ప్రణీత్‌రెడ్డి, దేవరం యోగిత, దేవరం తేజ, మిర్యాల ప్రతాప్‌రెడ్డి, పంజాల రష్మి, పంజాల ప్రసన్నలు విదేశాల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. నలమాస రవళి, రణబోత్ శృతి, నలమాస వేణు, శివరాత్రి సైదులు, వేముల వెంకటేష్, గుర్రాల సుస్రత్‌కుమార్, వెన్ను ప్రసాద్, అనుముల శిల్ప, అనుముల సుష్మ, మిర్యాల రవీందర్‌రెడ్డి, పంజాల రాంచందర్, కందుకూరి రాకేశ్, కందుకూరి రోజా, పంజాల శ్రావణ్, పంజాల పూర్ణిమ, పంజాల పవన్, పంజాల లావణ్య, పంజాల వరుణ్, పంజాల కౌశిక్, దారం శ్రావణ్, మట్టిగజం వీరేశ్, దారం సృజన్, పంజాల సాయికుమార్, చుంచు శ్రావణ్, చుంచు పూజ, కాశిమల్ల రాంబాబు, కాశిమల్ల శిరీష, గుండెల వినయ్‌బాబులు హైదరాబాద్, బెంగుళూర్‌లో వివిధ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో జాబ్ చేస్తు న్నారు. నలమాస నవ్య హిందుస్థాన్ యూనివర్శిటీ చెన్నైలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, కొండపల్లి భావిక హైదరాబాద్‌లోని ఇంజనీరింగ్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. గుండెల ప్రణయ్‌బాబు హైదరాబాద్‌లోని మావీ ఫుడ్స్‌లో క్యాలిటీ కంట్రోల్లో జూనియర్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నాడు. పంజాల శ్యాం సుందర్, పంజాల సురేశ్, పూజల సతీశ్, దేవరం చైతన్య, అనుముల శిరీష, అనుముల సుమన్, అనుముల రమేశ్ లెక్చరర్లుగా, పైండ్ల వీరన్న, కాశిమల్ల విక్రంకుమార్, పంజాల పావని, ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్‌ల్లో టీచర్‌గా పని చేస్తున్నారు. మట్టూరి నాగేశ్వర్‌రావు, గుండెల రాజు, పోతుగంటి విజయ్ జర్నలిస్టులుగా పని చేస్తున్నారు. తాళ్ల పురుషోత్తం శ్రీరాం సిటీ యూనియన్ ఫైనాన్స్ ఆర్ఎంగా, కొండపల్లి వినిత్‌కుమార్ ఎన్‌సీఆర్ కంపెనీలో మేనేజర్, మంద యాకన్న శుభనందిని చిట్ ఫండ్స్‌లో రీజినల్ మేనేజర్‌గా, గుర్రాల వంశి కుమార్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో, బైరోజు కిరణ్, పోతుగంటి రామాచారి




డాక్టర్ పంజాల కార్తీక్


విద్య అంటేనే దేహానికి వ్యాయామం, మనసుకు సంతోషం : ప్లేటో

ప్రైవేట్ బ్యాంకులో పని చేస్తున్నారు. పంజాల చిన్న సురేశ్ విలేజ్ వెల్ఫర్ (కరెంట్)గా పని చేస్తున్నారు. కోటగిరి శ్రీలత ఈజీఎస్‌లో టీఏగా, పప్పుల ప్రసాద్, అశోక్‌లు బీపీఎల్‌లో, గోల్కొండ శ్రావణ్ మెడికల్‌లో ఉద్యోగం చేస్తున్నారు. గంగదారి హేమాకర్ సీవిల్ ఇంజనీరుగా ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నారు, బుడిగబోయిన నవీన్ హైదరాబాద్‌లోని జీవోఫైబర్ నెట్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. పంజాల రమేశ్ ఆర్టీసీలో ప్రైవేట్ ఉద్యోగిగా, పైండ్ల మధు, గెల్లె నవీన్, ఇరుగు సురేశ్, కాశిమల్ల శ్యాంబాబు, గుడిసె వేణు ప్రైవేట్ కంపెనీలలో ఉద్యోగం చేస్తున్నారు. గంగదారి నారాయణ ఎల్‌ఐసీ ఏజెంట్‌గా, రణబోత్ ప్రశాంత్‌రెడ్డి, చల్లా కృష్ణ మెడికల్ ఫీల్డ్‌లో పని చేస్తున్నాడు. గద్దర్ తన రచనా నైపుణ్యంతో ఎన్నో కవిత్వాలు, పల్లెపాటలు రాసి పలువురి ప్రశంసలు పొందాడు. ప్రజా గాయకుడు గద్దర్ ప్రేరనతో ప్రజా చైతన్య రచనలు చేస్తూ... తన పేరునే కలం పేరుగా మార్చుకుని గ్రామ ఖ్యాతిని చాటుతున్నాడు. కొమరాజుల సంజీవ సర్వేయర్‌గా, గుడిసె రాము ఫోటో, వీడియో గ్రాఫర్‌గా, పంజాల సందీప్ ఫోటో, వీడియో గ్రాఫర్, సింగిడి యూటూబ్ ఛానల్‌లో పని చేస్తున్నారు. పెరుమాండ్ల ప్రతాప్, గోల్కొండ సతీశ్, పైండ్ల కృష్ణలు మిషన్ భగీరథలో వాటర్ టెక్నిషియన్లుగా పని చేస్తున్నారు. అంతేగాక గ్రామానికి చెందిన ఆర్టిస్టులుగా (పెయింటింగ్) పులి రాంబాబు, గుండెల రాజులు ఉన్నారు.



జంగిలిగొండ గ్రామ యువత

## నవ్వులు పూయిస్తాడు.. మన రాజమౌళి

GADDAM RAJAMOULI




గ్రామం: జంగిలిగొండ, పేరు: గద్దం రాజమౌళి. చిన్న చిన్న కార్యక్రమాలలో ప్రారంభమైన తన నటనా ప్రస్థానం బుల్లితెర నుండి వెండితెరకు చేరింది. చిన్నతనంలోనే గ్రామంలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమంలో స్వరం మార్చి మాట్లడిన రాజమౌళి నవ్వులు పూయిస్తున్నాడు. తన నటనతో అందరినీ మెప్పిస్తూ ముందుకు సాగుతున్నాడు. గ్రామంలో ఐదో తరగతి వరకు చదివి.. కళాశాలలో ఎన్‌సీసీలో వివిధ కళా ప్రదర్శనలతో ఓ ప్రత్యేక గుర్తింపు వచ్చింది. తెలంగాణ ఉద్యమంలో స్వగ్రామంలో దూంధాం ప్రదర్శనలతో ఆకట్టుకున్నాడు. సాంస్కృతిక సారథి రసమయి బాలకిషన్ ప్రోత్సాహంతో బండ వెంకన్న సహకారంతో కళారంగంలో ఉద్యోగం పొందాడు. ఈటీవీలో ప్రసారమవుతున్న జబర్ధస్త్‌లో తన మిత్రుడు సంగీత దర్శకుడు బొబ్బిలి సురేశ్ ద్వారా వేణు వండర్ బృందంలో ప్రవేశించి 450 స్కిట్లు చేశాడు. 4వేలకు పైగా స్టేజీ కార్యక్రమాలు, అనేక ప్రదర్శనలు ఇచ్చాడు. బుల్లితెరపై నటిస్తూ మెప్పిస్తున్న రాజమౌళి వెండితెరపై నటించే అవకాశం దక్కించుకున్నాడు. 'జాతరకొచ్చిన హీరోలు' సినిమా లో తాగు బోతుగా నటించాడు. అలాగే రాయలసీమ లవ్‌స్టోరీ, నివాసి, బంగారు బుల్లోడు, సిల్లిఫేలోస్, పేపర్‌బాయ్, నాటకం, వీరనారి చాకలి ఐలమ్మ, అనువంశ కథ, యమహోయమ, అనగనగా ఒక దుర్గలలో మొత్తం 20 సినిమాలలో నటించారు. మరో 9 సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. అంతేగాక ఇతర రాష్ట్రాల్లో, విదేశాల్లో అనేక ప్రదర్శనలిచ్చాడు. 2012లో డిప్యూటీ మాజీ సీఎం దామోదర రాజనర్సింహా చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు సినీ నటులు సుమన్, కమలహాసన్ చేతుల మీదుగా హాస్య నటుడిగా అవార్డు అందుకున్నారు. 2018లో ఉత్తమ టీవీ కమిడియన్‌గా మథర్‌తెరిస్సా అవార్డు, చెందు ఎల్లమ్మ అవార్డు, జిల్లా కళాకారుడిగా ఉత్తమ అవార్డు లతో పాటు విదేశాల్లో, ఢిల్లీలో, గుజరాత్‌లో ఎన్నో ఉత్తమ అవార్డులు అందుకున్నారు.








ఆవకాశాలు ఒకరిచ్చేవి కావు..మనమే వాటికై కృషిచేయాలి : ఇందిరాగాంధీ

# చిత్రకారుడై.. పాత్రికేయుడై.. ఉద్యమ బాటలో.. ఉద్యమకారుడిగా..!

GUNDELA RAJU



ఆయనకు చిన్ననాటి నుండే బొమ్మలు గీయడం అంటే ఎంతో మక్కువ.. అంతే గాక సమాజానికి ఏదో ఒక సేవ చేయాలనేది ఆయన ఆశయం.. జంగిలిగొండ గ్రామానికి చెందిన గుండెల రాజుకు ఉత్తమ చిత్రకారుడిగా గుర్తింపు వచ్చింది.1998లో 'రాజనాల' స్మారక 'యువశక్తి' అవార్డును రవీంద్ర భారతిలో డాక్టర్ సినారె చేతుల మీదుగా అందుకున్నారు. 2001లో ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక గ్రామీణ కళాకారుల సంక్షేమ సంస్థ నుండి 'అపురూప చిత్రకారుడు, అతి ఆకర్షణీయ ఉత్తమ కళాకారుడిగా అవార్డును అందుకున్నాడు. కరోనా కష్టకాలంలో సినీనటుడు సోనూసూద్ ఎందరో పేదలకు సాయమందించారు. మరెన్నో సమాజహిత కార్యక్రమాలు చేయాలని ఆశీస్తూ.. ఆయన నటించిన 71 సినిమాల పేర్లతో గీసిన చిత్రానికి ప్రముఖుల నుంచి ప్రశంసలు పొందాడు. అంతేగాక సోనూసూద్ స్వయంగా ఫోన్ చేసి గుండెల రాజును అభినందించారు. కాగా తెలంగాణ మలిదశ ఉద్యమంలో గ్రామానికి చెందిన మిత్రులతో కలసి తొలిసారిగా దూంధాం నిర్వహించి, గ్రామంలో ఉద్యమ ఆకాంక్షను చాటిచెప్పారు. ఈ క్రమంలోనే మే28, 2010లో వైఎస్ జగన్ ఓదార్పు యాత్ర సందర్భంగా రైల్వేస్టేషన్‌లో జరిగిన ప్రతిఘటన దాడిలో తీవ్రఉద్రిక్తతల నడుమ ప్రాణాలను పణంగాపెట్టి వార్తా సేకరణకు వెళ్లిన రాజుకు రాళ్లదాడిలో తలకు తీవ్ర గాయమైంది.



దీంతో మెరుగైన వైద్యం కోసం మానుకోట ఏరియ ఆసుపత్రి నుండి ఎంజీఎంకు తరలించారు. మరుసటి రోజు టీఆర్ఎస్ అధినేత, ప్రస్తుత సీఎం కేసీఆర్ ఎంజీఎంకు వచ్చి గుండెల రాజును పరామర్శించి, సంఘటన వివరాలు అడిగితెలుసుకున్నారు. అదే విధంగా నేరరహిత సమాజం కోసం తన వంతు బాధ్యతగా 2012లో వరంగల్ రూరల్ పోలీస్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న వివిధ నేరాలపై 'చైతన్యం' పేరుతో డాక్యుమెంటరీ, మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలకు పాల్పడితే చట్టపరమైన నేరాలు, శిక్షలను ప్రజలకు తెలియజేసి, చైతన్య పరిచేందుకు మరో డాక్యుమెంటరీ 'నిర్భయ చట్టం-2013' పేరుతో డీఎస్పీ ఆదిరెడ్డి రమాదేవి గారి కాన్సెప్ట్‌తో గుండెల రాజు రూపొందించారు. ఈ డాక్యుమెంటరీతో అప్పటి ఐజీ రవిగుప్త, డీఐజీ కాంతారావు, ఎస్పీ పాలరాజు, డీఎస్పీ రమాదేవిలు అభినందించి, అవార్డులను అందజేశారు.



అంతేగాక రెండు దశబ్దాల తన పాత్రికేయ సుధీర్ఘ జీవితంలో మానుకోట ప్రాంతంలో అన్యాక్రాంతమవుతున్న ఎన్నో ప్రభుత్వ భూములు, నీటి వనరు లతో పాటు సమాజంలో జరుగుతున్న అక్రమ అసాంఘీక కార్యక్రమాలకు వ్యతిరేకంగా ఎన్నో సంచలనాత్మకమైన విషయాలను వెలుగులోకి తీసుకవస్తున్నారు. మానుకోట వారపత్రిక నుండి ప్రారంభమైన తన పాత్రికేయ ప్రస్తానంలో ప్రజాశక్తి, ఈనాడు, నమస్తే తెలంగాణలో సేవలందించి ప్రస్తుతం వెలుగు దిన పత్రిక ద్వారా అవినీతి నేరమయసమాజంపై అక్షరాయుధాన్ని సందిస్తున్నారు.



గాయపడిన గుండెల రాజును వరంగల్ ఎంజీఎంలో పరామర్శిస్తున్న టీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్

## జంగిలిగొండ గ్రామ చరిత్ర ఆవిష్కరణ మహాద్భుతఘట్టం:

నా మూడు సంవత్సరాల స్వప్నం సాకారమైన రోజు.. అక్షరాలను ఇటుకలుగా పేర్చి నిర్మించిన జంగిలిగొండ గ్రామ చరిత్ర ఆవిష్కరించిన మరవలేని రోజు శనివారం 2022, జనవరి 15. ఈ మహాధ్భుతఘట్టానికి సహకరించిన అతిరథ మహారథుల నడుమ ఆటలు, పాటలు, సాంస్కృతిక, క్రీడోత్సవాలతో గ్రామ ప్రజల హర్షద్వానాల మధ్య కన్నుల పండుగగా జరిగింది. ఈ కార్యక్రమానికి సహకరించిన డాక్టర్ భూక్య మురళీనాయక్, నాళ్ల వీరన్న, డాక్టర్ కల్వకూరి చంద్రశేఖర్, వంశీధర్‌రెడ్డి, శంతన్ రామరాజు, బండి శ్రీహరి, దేవరం ప్రకాశ్‌రెడ్డి, దేవరం పురుషోత్తంరెడ్డి, పంజాల శ్యాంసుందర్, పంజాల యాకసాయిలు, జబర్దస్త్ రాజమౌళి, పంజాల నారాయణ, నలమాస ప్రభాకర్, నలమాస సుధాకర్, పంజాల సురేశ్, గవిని మహేశ్, తాళ్ల సోమయ్య, కాశిమల్ల బిక్షం, పంజాల గాలేశ్వర్, గుడిసె రాము, బోయిని మల్లయ్య, జక్క శంతన్, జక్క భాస్కర్, పైండ్ల వీరన్న మరియు యూత్ సభ్యులు, కళాకారులు, కుల, ప్రజా సంఘాల ప్రతినిధులు, రాజకీయనాయకులు, ప్రజాప్రతినిధులతో పాటు గ్రామస్తులందరికి పేరుపేరునా ధన్యవాదాలతో... – మీ.. గుండెల రాజు





























































సంక్రాంతి సంబరాలు -2022




సంక్రాంతి సంబరాలు -2022


సంక్రాంతి సంబరాలు -2022


# జంగిలిగొండ గ్రామ ప్రజలకు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలతో...




దేవరం ప్రకాశ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ
జిల్లా నాయకులు మహబూబాబాద్


దేవరం పురుషోత్తంరెడ్డి జిల్లా అధ్యక్షుడు
కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్, మహ'బాద్


పంజాల శ్యాంసుందర్
M.Sc., B.Ed


పంజాల యాకసాయిలు సర్పంచి
జంగిలిగొండ


తాళ్ల సోమయ్య కాంగ్రెస్ పార్టీ
నాయకులు, జంగిలిగొండ


కాశిమల్ల బిక్షం రిటైర్డు,
ఉపాధ్యాయులు


గుడిసె రాము లక్కి ఫోటో,
డిజిటల్ స్టూడియో, జంగిలిగొండ


జక్క శంతన్, లక్ష్మి
జంగిలిగొండ


శంతన్ రామరాజు తెలంగాణ
ఉద్యమకారుడు, మహబూబాబాద్


బోయిని మల్లయ్య (వార్డు సభ్యుడు)
జంగిలిగొండ


జక్క భాస్కర్ (రైల్వే ఉద్యోగి)
జంగిలిగొండ


బండి శ్రీహరి ఈశ్వర వర ప్రసాద్
మహబూబాబాద్


ఖాతాదారుల సేవలో 40 సం॥రంలోకి అడిగిడితున్న శుభ సందర్భంగా
జంగిలిగొండ గ్రామ ప్రజలకు ఖాతాదారులకు, రైతు సోదరులకు,
మిత్రులకు, మెకానిక్ సోదరులకు శుభాకాంక్షలతో...

C.R.I. PUMPS
FinOlex PIPES
Goldmedal SWITCHES & SYSTEMS


ప్రో॥ నాళ్ల వీరన్న

నమ్మకానికి నాణ్యతకు మరోపేరు
ప్రకాష్ ఎలక్ట్రికల్స్

ఆరోగ్య శ్రీ మరియు EHS సౌకర్యం కలదు
శ్రీసాయి ఆర్థో, ట్రామాకేర్ హాస్పిటల్
సెల్ నెం: 9849061210


డా॥ కల్వకూరి చంద్రశేఖర్
M.B.B.S., D.Orth
ఎముకలు, కీళ్ళు, నరములు, వెన్నుముక ప్రత్యేక శాస్త్ర చికిత్సా నిపుణులు


డా॥ కల్వకూరి రోహిణి
M.B.B.S.
జనరల్ ఫిజిషియన్


హరికిషన్ మిల్ రోడ్, మహబూబాబాద్













Jangiligonda  మన ఊరు “జంగిలిగొండ”  Jangiligonda
Jangiligonda  @Jangiligonda  manaJangiligonda@gmail.com

గ్రంథకర్త పరిచయం

# GUNDELA RAJU



గుండెల రాజు – రేణుక

| | |
|---|---|
| రచయిత | : గుండెల రాజు |
| | : సెల్ : 72889 85757 |
| జననం | : ఫిబ్రవరి 09, 1978 |
| తల్లిదండ్రులు | : గుండెల వీరయ్య – వీరమ్మ |
| భార్య | : గుండెల రేణుక |
| కొడుకులు | : గుండెల వినయ్ బాబు – ప్రణయ్ బాబు |
| స్వస్థలం | : గ్రామం జంగిలిగొండ, |
| | : మండలం, జిల్లా మహబూబాబాద్–506 104. |
| వృత్తి | : జర్నలిస్టు |
| రచనలు | : జంగిలిగొండ గ్రామ చరిత్ర |
| విద్య | : డిగ్రీ, టీటీసీ(డ్రాయింగ్)Higher Grade. |
| ఆసక్తి | : పరిశోధన వార్త కథనాలు, పెయింటింగ్స్(ఆర్ట్స్), చరిత్ర పరిశోధన. |
| పురస్కారాలు | : రాష్ట్ర ఉత్తమ చిత్రకారుడిగా 'రాజనాల' స్మారక 'యువశక్తి' అవార్డు,జూలై 26. 1998. |
| | : రాష్ట్ర ఉత్తమ చిత్రకారుడిగా, ఏపీ సాంస్కృతిక గ్రామీణ కళాకారుల సంక్షేమ సంస్థ అవార్డు, నవంబర్ 12, 2001. |



JANGILIGONDA GRAMA CHARITHRA Concept, writer & Presented by : GUNDELA RAJU (Artist & Senior Journalist) Cell: 72889 85757
e-mail : gundelaraju@gmail.com # H.No.1-13-21, BC Colony, JANGILIGONDA, Mandal & Dist. MAHABUBABAD-506104 (TS). Copies : 1000
Price : Rs.99/- Design by : GUNDELA VINAY BABU Printed by : MOHAN XEROX CENTARE, MAHABUBABAD.